మహిళా సాధికారతే
మానవాళి సాధికారత, సాధిద్దాం!





**యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్**
ఉప్పరపల్లి రోడ్, బెంగుళూరు హైవే
అనంతపురం - 515 002, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్స్ : +91 8554-244222/246884 ఫాక్స్: +91 244222/246884
ఇ మెయిల్: actionf@sancharnet.in ; yvmallareddy@yahoo.co.in
www.af-ecologycentre.org


Brot für die Welt

# లైంగిక సమానత్వం దిశగా ...

శిక్షణ దీపిక



# Towards Gender Equality...

Training Manual



# లైంగిక (జెండర్) సమానత్వం దిశగా ...

మహిళల పురోగతి, సాధికారత సాధనలో కీలక చోదక శక్తి

## శిక్షణ దీపిక

డిసెంబర్ 2014

# Towards Gender Equality...

'A key driver of development and women empowerment'

## TRAINING MODULE


**యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్**

ఉప్పరపల్లి రోడ్, బెంగుళూరు హైవే

అనంతపురం–515 002, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్స్ : + 91 8554 244222 / 246884, ఫాక్స్ : + 91 8554 244990

ఇ మెయిల్ : actionf@sancharnet.in; yvmallareddy@yahoo.co.in

web : www.af-ecologycentre.org

# లైంగిక (జెండర్) సమానత్వం దిశగా ... శిక్షణ దీపిక


## డిసెంబర్ 2014

సమన్వయకర్త : భీమప్ప, అసిస్టెంట్ డైరెక్టర్, యాక్షన్ ఫ్రెటర్నా

రూపకల్పన : యాక్షన్ ఫ్రెటర్నా బృందం
(అపర్ణ, అరుణ, భాస్కర్‌బాబు, భాస్కర్‌రెడ్డి, జయమ్మ, జ్యోతిర్మయి, మురళీకృష్ణ, రాజేశ్వరి, రామ్‌మోహన్, రిజ్వానా, రుద్రయ్య, సాయిరాం, షర్మిల, సుమలత, వెంకటేష్, ఎర్రిస్వామి)

విషయ సహకారం : ఏ. కళామణి (ఏపిమాస్), సి. సునీత (ఏపిమాస్), ఎం. నళిని (కన్సల్టెంట్)

కంపోజింగ్ : ఎన్. రమాదేవి

ఎడిటింగ్ : జె.వి. క్రిష్ణమూర్తి (ఏపిమాస్)

డిజైన్, లే అవుట్ : ధృతి డిజైన్, హైదరాబాద్

ముద్రణ : ధృతి డిజైన్, హైదరాబాద్



కాపీ రైట్ : యాక్షన్ ఫ్రెటర్నా 2014

(ఈ శిక్షణ దీపికను ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. అయితే 'యాక్షన్ ఫ్రెటర్నా సౌజన్యంతో' అని పేర్కొనడం సముచితం)



**యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్**
ఉప్పరపల్లి రోడ్, బెంగుళూరు హైవే
అనంతపురం–515 002, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్స్ : + 91 8554–244222 / 246884, ఫాక్స్ : + 91 8554 244990
ఇ మెయిల్ : actionf@sancharnet.in; yvmallareddy@yahoo.co.in
web : www.af-ecologycentre.org


## ముందుమాట

పేదరిక నిర్మూలనను, సమ్మిళితాభివృద్ధి దిశగా పురోగమింపజేసే కీలక చోదక శక్తిగా 'లైంగిక సమానత్వాన్ని' ప్రోత్సహించాలన్నది యాక్షన్ ఫ్రెటర్నా సిద్ధాంతము, మౌలిక విలువ కూడా. మన సాంప్రదాయ సంస్కృతిలో భాగంగా పిల్లల పెంపకంలో ఆడ మగ అనే లైంగికత్వము ఆధారంగా చూపించే వివక్ష మొదలవుతుంది. నిరంతరంగా కొనసాగుతుంది. కుటుంబంలో, సమాజంలో, సంస్థలలో, ప్రజా వేదికలలో అధికారం చెల్లుబాటయ్యే తీరులోని హెచ్చుతగ్గులు లైంగిక అసమానతలు, లైంగిక వివక్షగా వ్యవస్థీకృతమౌతాయని మా సంస్థ గుర్తించింది. అందువల్ల తన విధానాలు, కార్యాచరణలు, కార్యక్రమాల ద్వారా లైంగిక వివక్షను ఎదుర్కొని, లైంగిక సమానత్వాన్ని, మహిళా సాధికారతను ప్రోత్సహించాలని యాక్షన్ ఫ్రెటర్నా కృత నిశ్చయంతో వున్నది.

ఇంటిపని, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, తయారీ రంగం, సేవల రంగాలలో మహిళలది కీలక పాత్ర. అయినప్పటికీ సంబంధిత వనరుల పై హక్కు , అవకాశాల లభ్యతలో, వాటి అజమాయిషీలో, వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో మహిళల ప్రమేయం చాలా తక్కువ. ముఖ్యంగా, భూమిపై యాజమాన్యం వారిది కాదు. ఉద్యోగాలు, విస్తరణ సేవలు, ఆర్థిక సేవలు వారికి తగినంతగా అందుబాటులో వుండవు. శిక్షణ, నైపుణ్యం పెంపుదల, సమాచార, సాంకేతిక అవకాశాలను అందిపుచ్చుకోవడంలోనూ వారికి ప్రాధాన్యత తక్కువ. నిర్ణయాలు తీసుకోవడంలోను, అభివృద్ధి ప్రక్రియలలోను పాలుపంచుకోవడంలోను అవకాశం రావడం అరుదు. మహిళలు వివక్షకు, అనేక రకాలుగా దోపిడీకి గురవుతారు. వారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు మగవారి చేతుల్లో ఉంటాయి. వారు చేసే పనికి ప్రతిఫలం వుండదు, వున్నా తక్కువగా వుంటుంది. వారి శ్రమకు తగిన విలువ ఇవ్వరు. దీనికితోడు కరువులు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలు; వాతావరణ మార్పులు వారినే ఎక్కువగా దెబ్బ తీస్తాయి. పేదరికానికి స్త్రీలే మరింత ఎక్కువగా గురయ్యే దుస్థితి నానాటికి పెరుగుతున్నది. ప్రపంచంలోని మొత్తం 120 కోట్లమంది పేదవారిలో 70 శాతం మంది స్త్రీలే కార్యాలయం, పొలం, మార్కెట్ మొదలైన ఏ పని ప్రదేశంలోనైనా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, మహిళల స్థాయి ఏమిటో యాక్షన్ ఫ్రెటర్నాకు తెలుసు.

సంస్థా పరంగాను, కార్యక్రమాల పరంగాను చక్కని అవగాహనతో, శ్రద్ధాసక్తులతో రూపొందించిన విధానాలు, వ్యూహాత్మక ప్రక్రియల ద్వారా తన సిబ్బందిలో, అన్ని ప్రధాన విభాగాలలో, సమాజంలో లైంగిక అసమానతలను తొలగించి; లైంగిక సమానత్వాన్ని, సమ్మిళితాభివృద్ధిని సాకారం చేయాలన్నది యాక్షన్ ఫ్రెటర్నా లక్ష్యం.

'లైంగిక సమానత్వం దిశగా' అనే ఈ శిక్షణ దీపిక (మాన్యూల్) 1980 నుంచి గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కలసి పనిచేయడంలో మాకు కలిగిన అనుభవాల అధారంగా రూపు దిద్దుకున్నది. యాక్షన్ ఫ్రెటర్నా సిబ్బంది క్రియాశీల సహకారం వల్లనే ఈ శిక్షణ దీపిక రూపుదిద్దుకోగలిగింది. ఈ శిక్షణ దీపిక రూపకల్పన కృషిలో అంకిత భావంతో పాలుపంచుకున్న యాక్షన్ ఫ్రెటర్నా సిబ్బందికి నా మన:పూర్వక ధన్యవాదాలు. ఈ శిక్షణ దీపిక రూపకల్పన

దశలోను, అంతకు ముందునుంచి కూడా తమ విలువైన సూచనలతో ఎంతగానో తోడ్పడడమే కాకుండా, ఈ మొత్తం ప్రక్రియను నిజమైన సహభాగ, సమిష్టి కార్యక్రమంగా నిర్వహించిన కళామణి గారికి, నళిని గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. సహభాగ పద్ధతిలో, ప్రతిభావంతంగా లైంగికత్వ శిక్షణ ఇవ్వడానికి; సంస్థా పరంగా, కార్యక్రమాల పరంగా మహిళల ప్రాధాన్యాన్ని పెంచే కృషిని బలోపేతం చేయడానికి ఫెసిలిటేటర్లకు ఈ శిక్షణ దీపిక తగిన మార్గదర్శకాలను, ఆచరణాత్మక సూచనలను అందిస్తుంది.

లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించే దిశగా మేము సాగిస్తున్న ప్రస్థానంలో ఈ శిక్షణ దీపిక రూపకల్పన ఒక కీలక ఘట్టం.ఈ శిక్షణ దీపికను అవసరానుగుణంగా ఎప్పటికప్పుడు తగిన విధంగా మరింత మెరుగుపరచుకోవడము ఒక నిరంతర ప్రక్రియ. వివిధ సంస్థలు వారి అనేక కార్యక్రమాల ద్వారా లైంగిక సమానత్వాన్ని సాధించడంలో ఈ శిక్షణ దీపిక వారికి స్ఫూర్తిదాయకం కాగలదని మేము ఆశిస్తున్నాము. ఈ శిక్షణ దీపికను తగిన రీతిలో సద్వినియోగం చేసుకోవలసిందిగా వివిధ సంస్థలకు ఇదే మా ఆహ్వానం. యాక్షన్ ఫ్రెటర్నా మౌలిక విలువలను ఎలుగెత్తి చాటడంలోను, వాటిని సంపూర్ణంగా సాధించడంలోనూ ఇందుకు సంబంధించిన వారి అందరి సహకారాన్ని మేము కోరుతున్నాము.

**డాక్టర్ వై.వి. మల్లారెడ్డి**
డైరెక్టర్, యాక్షన్ ఫ్రెటర్నా

డిసెంబర్ 2014
అనంతపురం



## మా ఆశయం - లక్ష్యం - విలువలు

### ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్

**1. మా స్వప్నం :**

1. ప్రజలందరూ ఆర్థిక, ఆరోగ్య జీవనోపాధుల భద్రత కలిగి సాంఘిక సమన్యాయం, స్త్రీ పురుష సమన్యాయం, పరస్పర గౌరవ మర్యాదలతో, సమాజంలో శాంతి ప్రజా స్వామిక వాతావరణంలో పరస్పర సహకారముతో నిర్భయంగా జీవించగలగాలి.

2. అందరు వ్యక్తులు, వ్యవస్థలు, సంస్థలు భూమాతకు శాశ్వత ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ నిరాడంబరంగా జీవిస్తూ, ప్రకృతి సంరక్షణ ధర్మాన్ని పాటిస్తూ, ప్రజల కోసం ప్రకృతి, ప్రకృతి కోసం ప్రజలు అనే అవగాహనతో, జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిరమైన పర్యావరణం, జీవావరణం కాపాడబడుతూ ప్రకృతి ఒడిలో ప్రజలందరూ ఆరోగ్యకరంగా జీవించాలి.

**2. మా లక్ష్యం :**

1. నిస్సహాయులు, నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలను సంఘటితపర్చి, వారితో సంఘాలను, సహకార సంస్థలను స్థాపించి, వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా ఆదాయ భద్రత, పౌష్టికాహార, ఆహార భద్రత, సాధికారత, స్వయం సమృద్ధి సాధించడం ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ ముఖ్య లక్ష్యం.

2. కరువు కాటకాలతో సతమతమవుతున్న రైతాంగంతో ముఖ్యంగా సన్న,చిన్నకారు, వర్షాధార రైతులతో కలిసి పనిచేసి, కనీస పెట్టుబడులతో కరువును తట్టుకొనే విధంగా పర్యావరణహిత, వాతావరణహిత, సమగ్ర, సుస్థిరవ్యవసాయ పద్ధతులను రైతుల భాగస్వామ్యముతో అభివృద్ధి చేసి, వాటిని వ్యాప్తి చేయుటకు ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ అంకితమైనది.

3. సుస్థిర పర్యావరణం, సమతుల్య జీవావరణం, స్థిరవాతావరణం, జీవవైవిధ్యాల్ని పెంపొందిస్తూ, ఎడారీకరణను నివారిస్తూ, ప్రజలు, ప్రకృతి ఒకరినొకరు గౌరవించి పోషించుకొనే విధంగా సహజీవనం చేయునట్లు ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ కృషి చేస్తుంది.

4. నిరుపేదలు, జీవనావకాశాలులేని మహిళలు, యువత అభివృద్ధి లక్ష్యంగా వారితో కలిసి పనిచేస్తూ, విభిన్న జీవనోపాధుల పెంపుదలలో భాగంగా సహకార సంస్థలను ప్రోత్సహించడం, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్,వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువలను జోడించడం, మార్కెటింగ్, వ్యవసాయ రంగాలలో ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి పర్చడానికిఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ పని చేస్తుంది.

5. గ్రామాలలో స్త్రీ-పురుష వివక్షతలు లేని సాంఘిక సమానత్వం, గౌరవప్రదమైన జీవనం పెంపొందించడంతో పాటు శాంతి, ప్రజాస్వామ్యం, పరస్పర సహకారం, సామాజిక అండదండల ఆధారంగా, బాధ్యతాయుత సామాజిక వాతావరణం పెంపొందించేందుకు ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ కృషి చేస్తుంది.

6. ప్రభుత్వ సంస్థలతోనూ, భావసారూప్యత కలిగిన ప్రజా సంస్థలతోనూ, స్వచ్ఛంద సంస్థలతోనూ, వ్యక్తులతోనూ, మా సంస్థ కలిసి పని చేస్తుంది. ఇందులో భాగంగా సామాజిక ప్రయోజనం కోసం వివిధ సంస్థలు, మేధావులు, నిపుణులు, వ్యక్తులు చేస్తున్న కృషితో ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ చేయి కలిపి పనిచేస్తుంది.

7. ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటరు ఒక సమర్థవంతమైన, చలనశీల, శాశ్వత సంస్థగా పనిచేసే లక్ష్యం కలిగి వుంది. నిత్యం అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూ, నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ వుంటుంది. మారుతున్న పరిస్థితులకు, మారుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా తాను కూడా మారుతూ, సమాజాన్ని ప్రభావితం చేస్తుంది.

మా సంస్థ అనంతపురం జిల్లాలో ఒక అంతర్భాగం. ఈ బృహత్ ప్రయత్నంలో మేము ఏకాకులం కాదు. పై ఆశయాలు, లక్ష్యాలు సాధించడానికి ప్రభుత్వము, ప్రభుత్వేతర సంస్థలు, పౌర సంస్థలు, మీడియా, న్యాయ వ్యవస్థ, మేధావులు, శాస్త్రజ్ఞులు, సామాజిక కార్యకర్తలు మొదలగు వ్యవస్థలు ఎన్నో కృషి చేస్తున్నాయి. ఎవరిమటుకు వారు విడివిడిగానూ, సమన్వయంతోనూ ఈ దిశగా కృషి చేస్తున్నారు. ఈ మహత్తర కృషిలో ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ జిల్లాలో అంతర్భాగమై తన వంతు పాత్ర చురుకుగా నిర్వహిస్తున్నది.

### 3. మా ధర్మాలు :

ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్ ఫాదర్ ఫెర్రర్ నిర్దేశించిన క్రింది ధర్మాలను సంస్థకు, సిబ్బందికి ప్రవర్తనా నియమావళిగా భావించుకుంటుంది.

- పరచింతన
- విధికి మించి కృషి చేయడం
- చేసే పనుల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించడం.
- సాధ్యమయినంత ఎక్కువ మంది అవసరంలో వున్న వారితో కలిసి పని చేయడం.

### 4. మా ప్రధాన విలువలు :

1. **పరచింతన, దయ, నీతి నిజాయితీ, కష్టపడి పనిచేయడం, విశ్వసనీయత, నిజం మాట్లాడడం లాంటి ప్రధాన మానవీయ విలువలు పాటించడం.**

ఇతరులపట్ల ప్రేమ, దయ, ఇతరుల శ్రేయస్సు గురించి ఆలోచన, నీతి, నిజాయితీ, కష్టపడి పనిచేసే తత్వం, నిజం మాట్లాడడం, విశ్వసనీయత లాంటి ప్రధాన మానవీయ, సామాజిక విలువలను మేము స్వతహాగా పాటిస్తూ, సమాజంలో ఆ విలువల పెంపుదల కోసం కృషి చేస్తాము.

2. **సాంఘిక సమానత్వం, స్త్రీ-పురుష సమానత్వం**

సాంఘికంగా మనుషులందరూ సమానమని మేము విశ్వసిస్తాము. ముఖ్యంగా మహిళలు, అవకాశాల్ని అందుకోలేని వారికి, నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించి, సమానత్వం, పరస్పర సహకారం, సహజీవనం, ఆత్మగౌరవంతో బతికే విధంగా కృషి చేస్తాము.

సంస్థాగతంగానూ, మా ఎ.ఎఫ్ సంస్థ కార్యకలాపాల అమలులోను, ప్రజలతో మేము కలిసి పనిచేసే సందర్భాలన్నింటిలోనూ, జెండర్ సున్నితత్వం, సామాజిక న్యాయం పాటిస్తూ, కుల, స్త్రీ పురుష వివక్షతలకు అవకాశం లేని విధంగా కృషి చేస్తాము.

3. **సుస్థిర పర్యావరణం**

మా విధానాలు, పథకాలు అన్నింటిలోనూ సుస్థిర పర్యావరణాన్ని, జీవవైవిధ్యం, జీవావరణ సమతుల్యతను సుస్థిర వాతావరణం, ప్రకృతి సమతుల్యతలను గౌరవిస్తాము.

4. **ప్రభుత్వ సంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వ్యవస్థలు, పౌర సంస్థలతో కలిసి పనిచేయడం**

మేము ప్రభుత్వ సంస్థలతోనూ, భావసారూప్యం కలిగిన ప్రజా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, పౌర సంస్థలతో కలిసి సమన్వయంతో, పరస్పర సహకారంతో పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలమనే విశ్వాసంతో పని చేస్తాము.

5. **ప్రభుత్వ విధానాలను, పథకాలను ప్రభావితపరచడం**

నిరుపేదలకు, నిస్సహాయులకు, సుస్థిర పర్యావరణానికి అత్యధికంగా ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వ పథకాలు, విధానాల రూపకల్పనను ప్రభావితం చేయడానికి మేము కృషి చేస్తాము.

6. **పనిలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించడం**

మేము చేసే ప్రతి పనిలోనూ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాము.

7. **సామాజిక అవసరాలకు తగినట్లుగా పని చేయడం - పాఠాలు నేర్చుకోవడం**

మేము మారుతున్న పరిస్థితులకు, అవసరాలకు తగిన విధంగా మార్పుచెందుతూ, అనుభవాల నుండి

ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకొంటాము. కార్యక్రమాలను రూపకల్పన చేయడంలోనూ, వాటిని అమలు చేయడంలోనూ, మూల్యాంకనం చేయడంలోనూ ప్రజల భాగస్వామ్యమును పాటించి తద్వారా పాఠాలు నేర్చుకొంటాము. నూతన ఆలోచనలు, అనుభవాలు, అవిష్కరణలు ఎల్లప్పుడూ నిస్సహాయ ప్రజలను, నిరుపేదలను మెరుగుపర్చడానికి ఉపయోగపడే విధంగా కృషి చేస్తాము.


**8. సమిష్టి నాయకత్వం, అంతర్గత ప్రజా స్వామ్యం, కలసి మెలసి పనిచేయడం**

సంస్థ పనిచేసే ప్రక్రియలో, సమిష్టి నాయకత్వంతో, ప్రజాస్వామ్య పద్ధతిలో కలుపుగోలుగా పనిచేస్తాము. సంస్థాగత ప్రక్రియలలోనూ, ప్రజలతో కలిసి పనిచేసే ప్రక్రియలలోనూ ప్రజాస్వామ్య, పారదర్శక విధాలను పాటిస్తూ పనిచేస్తాము.

**9. పారదర్శకత – జవాబుదారీ విధానం**

మా భాగస్వాములందరితోనూ మేము పారదర్శకంగానూ, జవాబుదారీతనంతోనూ పనిచేస్తాము.







# పరిచయం

## నేపథ్యం

'మహిళల హక్కులు కేవలం మానవ హక్కులే; అంతకుమించి వారికి కల్పించే ప్రత్యేక అధికారాలో, సదుపాయాలో, ఎంత మాత్రం కావు' అనే సూత్రాన్ని విశ్వసిస్తూ, సానుకూల కార్యాచరణ ద్వారా లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి యాక్షన్ ఫ్రెటర్నా కట్టుబడి వుంది. సుస్థిరాభివృద్ధి, సమ్మిళితాభివృద్ధి సాధనకు మహిళా సాధికారత, మహిళల హక్కులకు తగిన గుర్తింపు కీలకమని యాక్షన్ ఫ్రెటర్నా ఆవిర్భావం, ప్రస్థానం అనుభవపూర్వకంగా నేర్పాయి. సాధికారత ఆవశ్యకతను నమ్మే యాక్షన్ ఫ్రెటర్నా తన లక్ష్యం, ఆశయాల సాధనకోసం మహిళలతోను, పురుషులతోను కలసి సాధికారత సాధించే మార్గంలో పనిచేస్తున్నది.

మా విజన్, మిషన్, మౌలిక విలువలు అన్నీ లైంగిక సమానత్వానికి అద్దంపడతాయి. ఈ సూత్రం ఆధారంగా యాక్షన్ ఫ్రెటర్నా బృందం ఆధ్వర్యంలో, సహభాగ ప్రక్రియలో ఈ శిక్షణ దీపిక రూపుదిద్దుకుంది. 2012 డిసెంబర్ 6–8 తేదీలలో మూడురోజులపాటు కోర్ టీం సభ్యులకు లైంగికత్వంపై ముమ్మర శిక్షణ కార్యక్రమంతో ఈ దిశలో మొదటి అడుగు వేయడం జరిగింది. ఆ తర్వాత 2013 జూన్ 8–9 తేదీలలో క్షేత్రస్థాయి మదింపు జరిగింది. క్షేత్ర పర్యటనలో తెలుసుకున్న అంశాలు, సిబిఓలతో జరిపిన చర్చల ప్రాతిపదికగా కోర్ టీం సభ్యులు, క్షేత్రస్థాయి సభ్యులు 2014 జనవరి 9–11 తేదీలలో మూడురోజులపాటు ముమ్మరంగా చర్చించారు. ఆ చర్చల సారాంశం :

- సిబ్బందికి (పిఎంఇ, ఏటిఎల్, ఏఇఓ, ఎస్‌టిఓ) తాజా విధులు, బాధ్యతలు
- కార్యక్రమ లక్ష్యం, ఆశయాలు, అంశాలు, ఆశించిన ఫలితాల గురించి మెరుగైన అవగాహన
- వివిధ సిబిఓలు (ఎస్ఎంజి, జిఎస్ఎస్, ఎంఎస్ఎస్, పిఎస్ఎస్) నిర్వహించే పాత్ర, వారి బాధ్యతలు, కార్యకలాపాల గురించిన మరింత అవగాహన
- పోస్టర్లు, కేస్ స్టడీలు, గేయాలు, నినాదాల వంటి సమాచార, విజ్ఞాన సామాగ్రి రూపకల్పనకు సంబంధించిన ప్రాథమిక అవగాహన
- 'లైంగిక సమానత్వం దిశగా' శిక్షణా దీపిక రూపకల్పనకు ప్రణాళిక
- శిక్షణా దీపికకు, సమాచార విజ్ఞాన సామగ్రి రూపకల్పనకు కావలసిన సమాచారాన్ని సిద్ధం చేయడంలో సిబ్బంది అందరూ పాలుపంచుకోవడం

సిబ్బంది ఎంతో ఆసక్తితో శిక్షణా దీపికకు, సమాచార విజ్ఞాన సామగ్రికి కావలసిన సమాచారాన్ని సిద్ధంచేశారు. 2014 ఫిబ్రవరి 12 వ తేదీన రిసోర్స్ పర్సన్స్ విశ్లేషణ, ప్రతిస్పందన కోసం ఆ సమాచారాన్ని వారితో పంచుకున్నారు. ఆ సమాచారాన్ని మరింతగా సమీక్షించి, లోపాలను గుర్తించడం కోసం 2014 ఫిబ్రవరి 22 వ తేదీన మరొక సమావేశం జరిపి చర్చించడం జరిగింది. అందజేసిన సమాచారం, గుర్తించిన లోపాల ఆధారంగా రిసోర్స్ పర్సన్స్ శిక్షణ దీపిక ముసాయిదాను రూపొందించి, తుది సమీక్ష కోసం ఆ ప్రణాళికను

2014 మార్చి చివరలో యాక్షన్ ఫ్రెటర్నా సిబ్బందితో పంచుకోవడం జరిగింది. ఈ ముసాయిదా శిక్షణా దీపిక ఆధారంగా 2014 ఏప్రిల్‌లో యాక్షన్ ఫ్రెటర్నా క్షేత్ర సిబ్బందికి మూడురోజుల పాటు ప్రయోగాత్మకంగా శిక్షణను నిర్వహించి, ఆ కార్యక్రమంలో వ్యక్తమైన అభిప్రాయాలకు అనుగుణంగా సవరించిన తుదిరూపంతో ఈ శిక్షణా దీపికను ముద్రించడం జరిగింది.

'లైంగిక సమానత్వం దిశగా' అనే ఈ శిక్షణా దీపిక సిబ్బందికి, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి, అమలు చేయడంలో భాగస్వాములయ్యే వారికి, పనిప్రదేశాన్ని లైంగికసమానత్వ సానుకూలంగా మార్చడానికి కృషిచేసే వారికి లైంగికత్వ శిక్షణలు ఇవ్వడంలో సహాయపడడానికి, మార్గదర్శకత్వం వహించడానికి ఉద్దేశించబడింది.

సంస్థ స్థాయిలోను, కార్యక్రమాల స్థాయిలోను లైంగిక సమానత్వాన్ని సాధించడంలో భాగంగా మహిళా ప్రాధాన్యాన్ని పెంచడంలో ఎదురయ్యే శిక్షణకు సంబంధించిన సంక్లిష్టమైన అంశాలను అవగాహన చేసుకోవడంలో ఈ శిక్షణా దీపిక శిక్షకులకు మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

## శిక్షణ దీపిక లక్ష్యం

యాక్షన్ ఫ్రెటర్నా విధానాలు, పద్ధతులు, కార్యక్రమాల ద్వారా సంస్థలో లైంగిక సమానత్వాన్ని, లైంగికసమానత్వ సానుకూల వాతావరణాన్ని ప్రోత్సహించడం

**ఆశయాలు**

- సంస్థకు సంబధించిన ప్రతి ఒక్కరిలో లైంగిక అవగాహనను, లైంగికసమానత్వ సానుకూలతను పెంపొందించడం
- లైంగికసమానత్వ సానుకూల పని వాతావరణాన్ని కల్పించడం
- లైంగికసమానత్వ సానుకూల విధానాలు, పద్ధతులు, కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా శ్రద్ధ వహించడం
- కుటుంబంలో, పనిప్రదేశంలో, సామాజిక సంస్థలలో, సమాజంలో, ఇంటా బయటా అంతటా మహిళా నాయకత్వాన్ని, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం
- సానుకూల వాతావరణం ద్వారా లైంగిక సమానత్వాన్ని పెంపొందించడం

## ఫెసిలిటేషన్ గురించి

శిక్షణలో పాల్గొనే అభ్యర్థుల అభిప్రాయాలను, అవగాహనను, ఆందోళనలను గ్రహించగలిగే విషయ పరిజ్ఞానం, లైంగిక సమానత్వ సానుకూలత, నైపుణ్యం ఫెసిలిటేటర్‌కు వుండాలి. సభ్యులమధ్య చర్చలు సక్రమంగా జరుగుతూ అవసరమైన విశ్లేషణలు, ప్రతిస్పందనలు చోటు చేసుకుంటూ, వాస్తవిక అంశాల ఆధారంగా తమ సొంత నిర్ణయాలు తీసుకునేలా చూడగలగడమే తన బాధ్యత అని ఫెసిలిటేటర్ గ్రహించాలి. ఆదేశిస్తున్నట్టుగానో, నిరంకుశంగానో ఫెసిలిటేటర్ వ్యవహరించకూడదు. చర్చ ఎన్నడూ వ్యక్తిగతంగా సాగకూడదు. శిక్షణ వల్ల అభ్యర్థుల అవగాహన స్థాయిలో వచ్చిన మార్పును అంచనా వేయడానికి వీలుగా శిక్షణకు ముందు, శిక్షణ తర్వాత పరీక్ష నిర్వహించాలి.

**ఫెసిలిటేటర్ ముఖ్య లక్షణాలు**

- ఫెసిలిటేటర్‌కు లైంగిక సమానత్వ సానుకూలత వుండాలి. లైంగికతకు సంబంధించిన అంశాల గురించి చక్కగా తెలిసి వుండాలి.
- సామాజిక అవగాహనా నైపుణ్యాలు కలిగి, శిక్షణా బృందాన్ని కలిసికట్టుగా నిర్వహించగలిగి వుండాలి. బృంద సభ్యులు వారి అభిప్రాయాలను లేదా సూచనలను సహభాగ పద్ధతిలో తెలియజేసే విధంగా బృందాన్ని నిర్వహించగలిగిన నేర్పరితనం వుండాలి. సభ్యులు ఏమైనా సమస్యలను లేదా అంశాలను వ్యక్తపరిస్తే వాటిని పరిష్కరించగలిగే చాకచక్యం వుండాలి.
- వివరించే అంశం సభ్యులను ఆకట్టుకునే విధంగా, వారిలో ఆసక్తిని పెంచే రీతిలో చెప్పే సంభాషణా చాతుర్యం వుండాలి.
- సభ్యుల అభిప్రాయాలను దృష్టిలో వుంచుకుని సందర్భానికి తగినట్టు నడచుకోగలిగే సర్దుబాటు ధోరణి అవసరం.
- ఏ అంశానికి ఎంత సమయం కేటాయించాలనేది, ఏఏ బాధ్యతలను ఎవరెవరు చేపట్టాలనేది సభ్యులతో చర్చించి నిర్ణయంతీసుకోవాలి.
- సభ్యుల నుంచి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యేలా వారిని ప్రోత్సహించాలి.
- కలసికట్టుగా అవగాహన పెంపొందించుకునే విధంగా బృంద సభ్యులను ప్రోత్సహించాలి.
- శిక్షణ అంశాన్ని దృష్టిలో వుంచుకుని, అందరూ పాలుపంచుకునే రీతిలో తగిన ప్రక్రియను (కేస్‌స్టడీలు, ఆటలు, ఆట వస్తువులు, రోల్ ప్లే, అనుకరణలు, ఒక్కొక్కరిగా, బృందంగా పని చేయడం, ఉత్సాహాన్ని కలిగించే ప్రక్రియల వంటివి) ఎంచుకోవాలి.వీటికి కావలసిన వస్తువులను ముందే సిద్ధంగా వుంచుకోవాలి.
- శిక్షణా తరగతుల సారాంశాన్ని, అధ్యయనాంశాలను క్లుప్తంగా విశదీకరించగలగాలి.
- సమస్యలు, సవాళ్ళు, అవకాశాల గురించి సభ్యులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే, విశ్లేషించే, చర్చించే సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి.
- లైంగిక సమానత్వ భావన తమకోసమే అని శిక్షణలో పాల్గొన్న సభ్యులు భావించేలా శ్రద్ధ వహించాలి.

## మన పయనం



శ్రమిద్దాం శ్రమిద్దాం
సమ సమాజం సాధిద్దాం
★ ★ ★ ★
స్త్రీ - పురుష సమానత్వం కోసం
బడుగు లేని సమాజం కోసం
సమాన సాధికారం కోసం
అందరికీ ఆత్మ గౌరవం కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||
★ ★ ★ ★
కరువు లేని వ్యవసాయం కోసం
సుస్థిర వ్యవసాయ సమృద్ధి కోసం
పౌష్టికాహార భద్రత కోసం
వ్యవసాయేతర ఉపాధి కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||
★ ★ ★ ★
పరస్పర సహకారం కోసం
కుటుంబ స్వావలంబన కోసం
ఆర్థిక స్వయం సమృద్ధి కోసం
సమైక్య సంఘీభావం కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||
★ ★ ★ ★
అందరికీ ఆరోగ్యం కోసం
పిల్లలకు నాణ్యమైన విద్య కోసం
మానవ విలువల పెంపు కోసం
మానవ వనరుల సమృద్ధి కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||
★ ★ ★ ★
జీవకారుణ్య సమాజం కోసం
జీవ వైవిధ్య సమృద్ధి కోసం
సుస్థిర పర్యావరణం కోసం
వాతావరణ పరిరక్షణ కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||
★ ★ ★ ★
పరచింతన కోసం
విధికి మించి కృషి కోసం
పనిలో నాణ్యత కోసం
పటిష్ఠమైన ఎ.ఎఫ్. సంస్థ కోసం || శ్రమిద్దాం, శ్రమిద్దాం||



వై. వి. మల్లా రెడ్డి



## విషయ సూచిక


**ముందుమాట** **3**

**పరిచయం** **9**

**మన పయనం** **12**

**అధ్యాయం 1 : పరిచయాలు, మరింత అవగాహన** **15**

1.1 ఒకరిని గురించి ఒకరు తెలుసుకోవడం ........ 15
1.2 సభ్యులు ఆశిస్తున్న అంశాలు ........ 17
1.3 మౌలిక నిబంధనలు ........ 18
1.4 బాధ్యతలను పంచుకోవడం ........ 18

**అధ్యాయం 2 : లైంగికత్వాన్ని అర్థం చేసుకోవడం** **20**

2.1 లైంగికత్వానికి నిర్వచనం; లింగభేదానికి (సెక్స్), లైంగికత్వానికి (జెండర్‌కు) ఉన్న భేదం ........ 20
2.2 లైంగికపరంగా శ్రమ విభజన ........ 27
2.3 జెండర్ వివక్ష ........ 31
2.4 లైంగికత్వం:మూల కారణాలు, ప్రభావాలు ........ 33

**అధ్యాయం 3 : సమాజంలో లైంగికత్వం (జెండర్)** **36**

3.1 పితృస్వామ్యం, స్త్రీవాదం ........ 36
3.2 అధికారం చెల్లుబాటయ్యే తీరు ........ 40
3.3 పురుషత్వం, స్త్రీత్వం ........ 43
3.4 బాలురకు, బాలికలకు సామాజిక కట్టుబాట్లు ........ 45
3.5 వనరుల అందుబాటు, వనరులపై అధికారం ........ 47

## అధ్యాయం 4 : మహిళల సామాజిక స్థాయి; హక్కులు,చట్టాలు 49


4.1 సమాజంలో స్త్రీల స్థాయి ........ 50
4.2 స్త్రీలపై హింస ........ 51
4.3 స్త్రీల హక్కులు, చట్టాలు ........ 52
4.4 అభివృద్ధి విధానాలు ........ 55

అధ్యాయం 5 : మహిళా సాధికారత 58

5.1 సాధికారత అంటే ........ 58
5.2 సాధికారతకు సూచికలు ........ 59
5.3 వ్యవసాయంలో స్త్రీ, పురుషుల పాత్ర ........ 62
5.4 మహిళలకు సమాన ప్రాధాన్యంలో సిబిఓల పాత్ర ........ 62

అధ్యాయం 6 : ప్రధాన జీవన స్రవంతిలో లైంగికత్వం (జెండర్) 64

6.1 జెండర్ అంశాలు ........ 64
6.2 జెండర్ ప్రధాన జీవన స్రవంతి: సంస్థ స్థాయిలో ........ 66
6.3 జెండర్ ప్రధాన జీవన స్రవంతి: కార్యక్రమ స్థాయిలో ........ 68
6.4 జెండర్ తనిఖీ / ఆడిట్ : ........ 69
6.5 కార్యాచరణ ప్రణాళిక, అనంతర చర్యలు ........ 70




# అధ్యాయం 1 : పరిచయాలు, మరింత అవగాహన

ఉద్దేశం: అభ్యాసకులు పరస్పరం పరిచయాలు పెంచుకొని, మరింత అవగాహనతో శిక్షణాంశాలను నేర్చుకోవడానికి సంసిద్ధులవుతారు.

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 1.1 | ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడం | గ్రూపు ఎక్సర్‌సైజ్ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు, పువ్వులు, ఆకులు |
| 1.2 | సభ్యులు ఆశిస్తున్న అంశాలు | మేధోమథనం | 20 ని॥లు | ఫ్లాష్ కార్డ్స్, బోర్డు, ఫ్లిప్ చార్ట్, మార్కర్లు, బోర్డ్‌పిన్స్ |
| 1.3 | మౌలిక నిబంధనలు | పరస్పర సహకారాలు, చర్చలు | 15 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 1.4 | బాధ్యతలను పంచుకోవడం | పరస్పర సహకారాలు, చర్చలు | 15 ని॥లు | చార్టులు, మార్కర్లు |


## 1.1 ఒకరిని గురించి ఒకరు తెలుసుకోవడం

ఒక శిక్షణ విజయవంతం కావాలంటే సభ్యులు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం చాలా ముఖ్యం. దాని ద్వారా వారి మధ్య నమ్మకం, కలుపుగోలుతనం పెరుగుతుంది. శిక్షణ జరిగినన్ని రోజులు సభ్యులు కలిసిమెలిసి వుంటూ బృంద కార్యక్రమాలలో పాల్గొనడానికి, ఒకరి గురించి ఒకరు పరిచయం చేసుకోవడం అనేది చాలా ముఖ్యం.

క్రింద ఇచ్చిన రెండు ఎక్సర్‌సైజులలో ఏదో ఒకటి చేయడం ద్వారా సభ్యులు ఒకరికొకరు పరిచయమవుతారు; ఒకరిగురించి ఒకరు మరింతగా తెలుసుకోగలుగుతారు. వారి మధ్య వున్న సంకోచాలను, భయాలను దూరం చేసుకోగలుగుతారు.

### ఎక్సర్‌సైజ్ 1: ఇద్దరిద్దరు ఒక జట్టుగా ఏర్పడడం

ముందుగా సభ్యులందరిని నలుగురు లేదా ఐదుగురితో ఒక్కొక్క గ్రూప్ గా ఏర్పర్చాలి. వారు ఏ విషయాల గురించి మాట్లాడదలచుకుంటే ఆ విషయాలు ఐదునిమిషాలపాటు మాట్లాడుకోమని చెప్పాలి. తరువాత ఒకరికొకరు అంతగా పరిచయంలేని ఇద్దరిద్దరు కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడమని చెప్పాలి. అలా గ్రూప్‌గా ఏర్పడిన వారిని వారి వ్యక్తిగత విషయాలను, వాటితోపాటు లైంగికత్వాన్ని (జెండర్) గురించి ఏమి తెలుసో కూడా నిర్ణీత సమయం వరకు వారిని మాట్లాడుకొమ్మని చెప్పాలి.



(ఏ విషయాల గురించి మాట్లాడాలోఫెసిలిటేటర్ ముందుగానే నిర్ణయించుకుని వుండాలి.
ఉదా : అలవాట్లు, అభిరుచులు, ఇష్టాలు, అయిష్టాలు మొదలైనవి)

అందరూ మాట్లాడుకున్న తరువాత ఒకరి గురించి ఒకరు ఏమి తెలుసుకున్నారో గ్రూప్‌గా వచ్చి మునుపు ఏర్పడిన పెద్ద గ్రూపులోని అందరితో పంచుకోవాలి.

సూచన : (1) సభ్యులు ఏ విషయాలనూ పుస్తకంలో రాసుకోకూడదు.
(2) ఎవరి అభిప్రాయాలను కించపరచకూడదు.
(3) లైంగికత్వానికి సంబంధించిన అంశాలను సభ్యులు చెప్పినపుడు ఫెసిలిటేటర్ బోర్డుపైన కాని, చార్ట్ పైన కాని రాసుకోవాలి.

ఫెసిలిటేటర్ లైంగికత్వంపై సభ్యుల అవగాహన గురించి తెలుసుకోవడానికి, తగిన విధంగా విషయాంశాలను చర్చించడానికి ఇది తోడ్పడుతుంది.

ఈ ఎక్సర్‌సైజ్ వలన ఒకరి గురించి ఒకరికి మరిన్ని విషయాలు తెలియడం, ఒకేరకమైన అభిరుచులు, అలవాట్లు వున్న వారు తొందరగా కలిసిమెలిసిపోవడం జరుగుతుంది. అందువలన శిక్షణలో మరింత ఉత్సాహంగా పాల్గొనడానికి ఎక్కువ అవకాశం వుంటుంది.

### ఎక్సర్‌సైజ్ 2 : హృదయ స్పందన

1. సభ్యులను హాలులోని అన్ని వస్తువులను అందినంత వరకు ముట్టుకోమని చెప్పాలి.
2. సభ్యులను ఒకరితో ఒకరు కరచాలనం చేసుకోమని చెప్పాలి. కరచాలనం చేసేటపుడు ఒకరితో ఒకరు మాట్లాడకుండా ముఖంపైన చిరునవ్వు వుండాలని చెప్పండి. తరువాత ఎవరి స్థానంలో వారిని కూర్చోమని చెప్పండి.
3. ఫెసిలిటేటర్ హాలులో ముందుగానే కొన్ని పువ్వులు, ఆకులు తెచ్చిపెట్టుకోవాలి. సభ్యులను ఒక్కొక్కరిగా వచ్చి వారికిష్టమైన పువ్వును లేదా ఆకును తీసుకుని పరిచయం చేసుకోమని చెప్పండి. పరిచయం చేసుకున్న తరువాత వారు తీసుకున్న వస్తువును బట్టి వారు ఆ వస్తువునే ఎందుకు తీసుకున్నారో చెప్పమనండి.(ఉదా: ఎవరైనా సభ్యులు పూవు తీసుకున్నట్లయితే పువ్వే ఎందుకు తీసుకున్నారో వివరించమని అడగండి). లైంగికత్వం (జెండర్) అంటే వారికి ఏమి తెలుసునో అడగండి. శిక్షణకు సంబంధించి ఎటువంటి అంశాలపై పని చేస్తారో చెప్పమని అడగండి. ఈవిధంగా అందరితో పరిచయ కార్యక్రమం ముగించాలి.

**సూచన:** ఫెసిలిటేటర్ జెండర్ (లైంగికత్వం) కు సంబంధించిన విషయాలను సభ్యులు చెప్పే విధంగా ఫెసిలిటేట్ చేస్తూ అంశాలు వచ్చినపుడు వాటిని బోర్డుపైన కాని, ఛార్ట్ పైన కాని రాసుకోవాలి.

ఈ ఎక్సర్‌సైజ్ సభ్యులందరూ శిక్షణ హాలులో వున్న వస్తువులపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా శిక్షణ హాలుతో ఒకరకమైన అనుబంధం ఏర్పరచుకోవడానికి, సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోడానికి, శిక్షణను ప్రభావవంతంగా జరుపుకోవడానికి దోహదపడుతుంది.

## 1.2 సభ్యులు ఆశిస్తున్న అంశాలు

ఫెసిలిటేటర్ సభ్యులందరూ ఏ ఉద్దేశంతో ఈ శిక్షణకు హాజరయ్యారో, వారు ఏమి నేర్చుకోవాలనుకుంటున్నారో మేధోమధనం ద్వారా లేదా ఫ్లాష్ కార్డుపైన వ్రాయించి సేకరించిన అంశాలను బోర్డుపైన లేదా చార్టుపైన వ్రాయాలి. తయారుచేసుకున్న శిక్షణాంశాలతో చివరలో విషయాలను క్రోడీకరించాలి.

## 1.3 మౌలిక నిబంధనలు

శిక్షణ సమర్ధవంతంగా నిర్వహించాలంటే సభ్యుల ఆమోదంతో మౌలిక నిబంధనలను ఏర్పరచుకోవడం చాలా అవసరం. ఈ నిబంధనలు అందరి ఆమోదంతోనూ, సహకారంతోనూ ఏర్పరచుకోవాలి. ఉదా: సెల్‌ఫోన్‌ను శబ్దంకాకుండా వుంచడం లేదా నిలిపివేయడం, సమయపాలన, ఒకరి తరువాత ఒకరు మాట్లాడడం మొదలైనవి. నిర్ణయించుకున్న నిబంధనలను చార్టుపైన వ్రాసి శిక్షణా స్థలంలో ఒకచోట అంటించుకోవాలి. ఇవన్నీ పాటించే విధంగా చూసుకోవడం కూడా సభ్యుల బాధ్యతగా వివరించాలి.

## 1.4 బాధ్యతలను పంచుకోవడం

ఫెసిలిటేటర్ సభ్యులందరిని కమిటీలుగా ఏర్పాటుచేసి, శిక్షణకు సంబంధించిన అన్ని బాధ్యతలను వారే నిర్వహించే విధంగా చేయాలి. శిక్షణలో ఉన్న అందరు సభ్యులను 3-4 లేదా 4-5 చిన్న గ్రూపులుగా ఏర్పరచి ఒక్కొక్క గ్రూపు ఒక్కొక్క బాధ్యతను పంచుకునే విధంగా ఏర్పాటు చేయాలి. శిక్షణ ముగిసే రోజు వరకు సభ్యులందరూ అన్ని బాధ్యతలను నిర్వహించే విధంగా చూసుకోవాలి. ప్రతిరోజు కమిటీల వారిగా వారి పేర్లను చార్టుపైన వ్రాసి శిక్షణా స్థలంలో అంటించుకోవాలి.

**కమిటీలు**

1. **రిపోర్టింగ్ కమిటీ:** వీరు శిక్షణ మొదలైన దగ్గర నుంచి చివరి వరకు ఏమి జరిగిందో నివేదిక (రిపోర్ట్) ఇవ్వాలి. ఈ నివేదికను గ్రూపు సృజనాత్మకతను బట్టి సభ్యులందరికి ఆసక్తి కలిగే విధంగా చేయవచ్చు. ఏ రోజు జరిగిన శిక్షణను ఆ మరుసటి రోజు శిక్షణ మొదలవడానికి ముందే వీరు వారి నివేదికను తయారు చేయవలసి వుంటుంది. మరుసటి రోజు ఉదయం శిక్షణ మొదలవడానికి ముందే అందరు సభ్యులతో పంచుకోవలసి వుంటుంది.

2. **సమయ పాలన కమిటీ:** వీరు శిక్షణా కాలమంతా అనుకున్న సమయం ప్రకారం జరుగుతున్నది లేనిది చూసుకోవలసి వుంటుంది. భోజనము, టీ విరామం, సభ్యుల విరామ సమయం మొదలైన అన్ని విషయాలు సరిగ్గా సమయం ప్రకారం జరుగుతున్నాయో లేదో చూసుకోవలసి వుంటుంది. తామందరూ కలసికట్టుగా ఏర్పరచుకున్న నిబంధనలను సభ్యులు ప్రతి ఒక్కరూ పాటించే విధంగా చూసుకోవాలి.

3. **సదుపాయాల కమిటీ:** ఈ కమిటీ సభ్యులు శిక్షణకు సంబంధించిన సదుపాయాలు, అంటే భోజనం, వసతి, వస్తు సామాగ్రి, టీ, కాఫీ, టిఫిన్ మొదలైనవి సక్రమంగా వున్నాయో లేదో, గమనించాలి. వాటిని గురించి సభ్యులు సంతృప్తికరంగా వున్నారో లేదో తెలుసుకుని శిక్షణను ఏర్పాటు చేసినవారికి మార్పులు చేర్పుల కోసం సమాచారం ఇవ్వవలసి వుంటుంది. ఏవి బాగున్నాయో, ఏవి ఇంకా బాగా చేయవలసిన అవసరం వుందో అన్నిటి గురించి మరుసటి రోజు శిక్షణలో అందరికి వివరించవలసి వుంటుంది. సమయానుసారంగా ఫెసిలిటేటర్ వివరణ ఇవ్వవలసి వుంటుంది.

4. **సాంస్కృతిక కమిటీ:** ఈ కమిటీ సభ్యులు శిక్షణ సమయంలో అందరిని ఉత్సాహపరిచేందుకు మధ్యమధ్యలో పాటలతో, ఆటలతో కొన్ని కార్యక్రమాలు చేయాలి. అందువలన ఎప్పటికప్పుడు విషయాంశాలను ఉత్సాహంగా నేర్చుకోవడానికి సభ్యులకు అవకాశం వుంటుంది.

సభ్యులు బాగా పని చేయడానికి ఫెసిలిటేటర్ వారికి కొత్తకొత్త ఆలోచనలను అందించవలసి వుంటుంది. సభ్యులను ప్రోత్సాహపరచడంకోసం బాగా పనిచేసిన వారికి చిన్నచిన్న బహుమతులు కూడా ఇవ్వవచ్చు.



# అధ్యాయం 2 : లైంగికత్వాన్ని అర్ధం చేసుకోవడం

ఉద్దేశం: ఈ విషయాంశంలో పొందుపరిచిన వివిధ రకాలైన ఎక్సర్‌సైజుల ద్వారా సభ్యులందరూ జెండర్ అంటే ఏమిటో, లింగభేదానికి (సెక్స్‌కు), లైంగికత్వానికి (జెండర్‌కు) ఉన్న తేడా ఏమిటో, విధులు, బాధ్యతలు, పాత్రలు, సమాజంలో జెండరు వివక్ష, పని విభజన మొదలైన అంశాలపై అవగాహన పెంపొందించుకుంటారు.

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 2.1 | లైంగికత్వానికి నిర్వచనం, లింగభేదానికి (సెక్స్), లైంగికత్వానికి (జెండర్‌కు) ఉన్న భేదం | గ్రూపు ఎక్సర్‌సైజ్, పరస్పర చర్చలు, మేధోమధనం | 200 ని॥లు | ఫ్లాష్ కార్డ్స్, ఫ్లిప్ చార్ట్, మార్కర్లు, బోర్డ్‌పిన్స్ |
| 2.2 | లైంగికపరంగా శ్రమవిభజన | గ్రూపు ఎక్సర్‌సైజ్, పరస్పర చర్చలు, మేధోమధనం | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 2.3 | లైంగిక వివక్ష | పరస్పర చర్చలు | 30 ని॥లు | తాడు, చార్టులు, మార్కర్లు |
| 2.4 | లైంగికత్వ మూల కారణాలు, ప్రభావాలు | గ్రూపు ఎక్సర్‌సైజ్, పరస్పర చర్చలు, మేధోమధనం | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |

## 2.1 లైంగికత్వానికి నిర్వచనం; లింగభేదానికి (సెక్స్), లైంగికత్వానికి (జెండర్‌కు) ఉన్న భేదం

**జెండరు అంటే ఏమిటి?**

ఫెసిలిటేటర్ ఈ క్రింది ఎక్సర్‌సైజ్ చేయించడం ద్వారా జెండర్ అంటే ఏమిటో వివరించాలి.

**ఎక్సర్‌సైజ్: నేనెవరిని ? (ఎవరి కూతురు / కోడలు, ఎవరి కొడుకు / అల్లుడు)**

**ప్రక్రియ :** ఫెసిలిటేటర్ సభ్యులందరిని గుండ్రంగా కూర్చోబెట్టాలి. ప్రతి ఒక్కరికి రెండు ఫ్లాష్ కార్డ్స్, ఒక మార్కర్ పెన్ ఇవ్వాలి. ఒక కార్డుపైన ఎవరి కూతురు / కొడుకు రాయమనాలి. రెండవ కార్డు పైన ఎవరి కోడలు / అల్లుడు వ్రాయమనాలి. అందరూ వ్రాసిన తరువాత ఆ కార్డులనన్నింటిని చదువుతూ నేలపైన లేదా టేబుల్‌పైన ఒక పద్ధతిలో అమర్చమని చెప్పాలి. ఎవరు ఎవరి పేరు వ్రాశారో, అంటే స్త్రీ పురుషులలో ఎవరి పేరు వ్రాశారో చర్చించాలి.

ఫెసిలిటేటర్ ఇక్కడ ఎందుకు ఎక్కువగా పురుషుల పేరు వ్రాయబడినదో; సమాజంలో, కుటుంబంలో స్త్రీ పాత్ర ఏ మేరకు వుందో; గుర్తింపు పురుషులకు ఎక్కువగా, స్త్రీలకు తక్కువగా ఎందుకు వుందో చర్చించాలి. స్త్రీ ఎక్కువగా ఒక తండ్రికి కూతురుగా, భర్తకు భార్యగా, అన్నకు చెల్లిగా, కొడుకుకు తల్లిగానే గుర్తించబడుతుంది. కాని పురుషుడు తనను భార్యకు భర్తగా, తల్లికి కొడుకుగా చెప్పుకోడు. తనకు తానుగానే చెప్పుకుంటాడు, కొడుకుగా చెప్పుకోవాలంటే తండ్రికి కొడుకుగా చెప్పుకుంటాడు. ఈవిధమైన తేడాలు సమాజంలో ఎందుకు వున్నాయో సభ్యులందరితో సున్నితంగా చర్చించాలి.

**ఎక్సర్‌సైజ్: లింగభేదానికి (సెక్స్‌కు), లైంగికత్వానికి (జెండర్‌కు) వున్న తేడాలు**

ప్రక్రియ : సభ్యులందరినీ చిన్న గ్రూపులుగా విభజించాలి. ముందుగా సిద్దంగా వుంచుకున్న పాత దినపత్రికలను, మాసపత్రికలను అన్ని గ్రూపులకు ఇవ్వాలి. పాత దినపత్రికలలో, మాసపత్రికలలో స్త్రీ, పురుషులకు సంబంధించిన బొమ్మలను; అలాగే స్త్రీ, పురుషుల బొమ్మలను విడివిడిగా కత్తిరించి ఒక చార్టుపై అతికించమని చెప్పాలి. అలా అతికించిన వాటిని తీసుకుని, సభ్యులను ఆ చిత్రాలలో వారు గుర్తించిన స్త్రీ, పురుష లక్షణాలను ఆ చార్టులలోని ఖాళీ భాగంలో రాయమనాలి.

ఈ ఎక్సర్‌సైజ్ వలన స్త్రీలు నిర్వహించే పాత్ర ఏమిటో, పురుషులు నిర్వహించే పాత్ర ఏమిటో; ఎవరు స్త్రీలు, ఎవరు పురుషులు అనే విషయాన్ని ఎలా వివరిస్తామో తెలుస్తుంది.

ఫెసిలిటేటర్ స్త్రీ, పురుష పాత్రలకు సంబంధించి అవగాహన కలిగిస్తూ పురుషుల పాత్రను ఒక నాయకుడిగా, ఒక నిర్ణయాధికారిగా, అన్ని రంగాలలోను ఆధిపత్యం చెలాయిస్తున్నవాడిగాను; స్త్రీలను ఎక్కువగా కుటుంబానికే పరిమితం చేస్తూ, అందానికి సంబంధించిన అంశాలపైన మాత్రమే ఉపయోగించుకునే ఒక సౌందర్య సాధనంగానూ సమాజంలో చిత్రీకరిస్తున్న తీరును వివరించాలి. ఏ రంగంలో చూసినా పురుషులతో పోల్చినపుడు స్త్రీలు చాలా తక్కువ సంఖ్యలో వుండడాన్ని ఉదాహరణలతో వివరించాలి.

**జెండర్ విధులు, బాధ్యతలు**
**ఎక్సర్‌సైజ్: యోగ నిద్ర-పునరావలోకనం**
**ప్రక్రియ:**

- శిక్షణ జరిగే గదిలో నిశ్శబ్ద వాతావరణాన్ని ఏర్పరచాలి
- మంచి సంగీతం వినిపించడం ద్వారా సభ్యులందరూ ప్రశాంతంగా సేదతీరేలా చూడాలి

- సభ్యులందరిని కళ్ళు మూసుకుని వెల్లకిలా (శవాసనంలో) పడుకోమని చెప్పాలి
- సంగీతం వింటూనే చుట్టుప్రక్కల వినపడే శబ్దాలను కూడా గమనించమని చెప్పాలి
- ఈ ప్రక్రియలో వారు వారి బాల్యావస్థ నుండి క్రమంగా వివిధ దశలలో జరిగే సంఘటనలను, భావాలను ఒక క్రమంలో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాలి
- ఆ క్రమంలో వారికి మొట్టమొదటిసారిగా ఏ సందర్భంలో, ఎవరి వలన, ఎందుకు తాను స్త్రీ లేదా పురుషుడు అన్న భావన (స్పృహ) కలిగిందో గుర్తు చేసుకోమనాలి
- శారీరకంగా తాను ఎప్పుడు స్త్రీ / పురుషుడు అని అనిపించిందో గుర్తు చేసుకోవాలి. శారీరకంగా మార్పు కలిగిన అనంతరం స్త్రీ / పురుషుడుగా బేధం కలిగించిన కట్టుబాట్లు, సందర్భాలు ఏవి, ఎందుకలా అనిపించిందో గుర్తు చేసుకోమనాలి
- ఈ ప్రక్రియ అంతా చాలా సున్నితంగా సంగీతం వింటున్నపుడే సభ్యులకు సూచనలుగా ఇవ్వాలి

చివరగా సభ్యులందరినీ చిన్న గ్రూపులుగా విభజించి వారి వారి అనుభవాలను పంచుకోమని చెప్పాలి. వాటిలో ఏ వ్యక్తికైనా తాను స్త్రీ / పురుషుడు అనే భావం ఏ వయస్సు నుండి కలిగిందో; ఏ భావనల వలన కలిగిందో, అంటే సమాజం, సంస్థలు (ఉదా: కుటుంబం, స్కూలు, స్నేహితులు) మొదలైనవి ఏవిధంగా కారణమయినాయనే విషయాలను కార్డు పైన రాయించాలి. పై ప్రక్రియను క్రింద ఇచ్చిన వివరణ ఆధారంగా క్రోడీకరించాలి.

వివరణ: వివిధ దశలలో జెండరును ప్రభావితంచేసే అంశాలను, వాటిని ప్రోత్సహించే వ్యవస్థను ఈ ప్రక్రియలో గుర్తించగలుగుతారు. ఇంతేకాక స్త్రీ పురుషుల స్వభావాలను, భిన్నత్వాలను అవి ఏర్పడే విధానాన్ని గుర్తించగలుగుతారు. వ్యవస్థ ప్రభావం ఎలా వుంటుందో కూడా గుర్తించగలుగుతారు. ప్రపంచవ్యాప్తంగా లైంగిక భేదాలు ప్రధానంగా పితృస్వామిక వ్యవస్థకు అనుగుణంగా, అంటే పురుషాధిక్యంతో, పురుషులకు అనుకూలంగా ఉన్నాయి. వాటివలన లైంగిక భేదాలు స్త్రీకి అనుకూలం కావు. అమ్మాయిలు చాలారకాల అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. వారు వివక్షను, హింసను అనుభవిస్తున్నారు. అందువలన అబ్బాయిలు అభివృద్ధి చెందినంతగా అమ్మాయిలు అభివృద్ధి చెందడం కాని, ప్రతిభను చూపడం కాని చేయలేరు. ఒకే కుటుంబంలో అబ్బాయిలు అభివృద్ధి చెందడం, అమ్మాయిలు అంతగా అభివృద్ధి చెందకపోవడం చూడవచ్చు.

ఇటువంటి లైంగిక వివక్షలు అమ్మాయిలకు మాత్రమే హాని కలిగించవు. మొత్తం కుటుంబానికి, దేశానికి, వారి సమాజానికి హాని కలుగుతుంది. అనేకమైన పాత్రలు, లక్షణాలు, బాధ్యతలు అబ్బాయిల మీద రుద్దబడుతాయి. జెండర్‌కు సంబంధించి వారు కూడా బాధితులే.

లైంగికత్వం అనేది సామాజికమైనది. మన వల్ల సృష్టించబడినది. కొత్త నిర్వచనాలను సృష్టించడం ద్వారా అమ్మాయిల, అబ్బాయిల; స్త్రీ, పురుషుల పాత్రలను మార్చవచ్చు. అమ్మాయిలు బలహీనులు, అబ్బాయిలు ఎక్కువ బలవంతులు అనే ఆలోచన సరైనదికాదని ఒక కొత్త సమాజాన్ని సృష్టించవచ్చు. నిజం ఏమిటంటే అమ్మాయిలు, అబ్బాయిలు వారికి కావలసినట్టుగా బట్టలు వేసుకోవచ్చు, ఆడుకోవచ్చు, చదువుకోవచ్చు, వారెంచుకున్న విధంగా వారు పెరగవచ్చు. అమ్మాయి శరీరాకృతి కలిగి వుండటం అనేది ఇంటి పనికి, అందరిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే ఉపయోగపడే వ్యక్తిత్వం అని కాదు, అలాగే అబ్బాయి శరీరాకృతి కలిగి వుండడం అంటే తెగింపు, తెలివి, బలం కలిగి వుండడమని కాదు. ఇవన్నీకూడా నేర్పించబడతాయి. ఇది వారి పెంపకంపై ఆధారపడి వుంటుంది.

మనం కోరుకుంటే జెండర్, కులం, జాతి ద్వారా నిర్ణయించబడిన ఈ పాత్రలను, బాధ్యతలను, లక్షణాలను, ప్రవర్తనలను మార్చుకుని ప్రతి ఒక్కరు వారికి ఇష్టమైన పాత్రలను, బాధ్యతలను ఎంచుకునే విధంగా ప్రతిభను అభివృద్ధి చేసుకుని, నచ్చిన జీవితాన్ని ఎంచుకునే విధంగా హక్కు కలిగిన ఒక సమాజాన్ని నిర్మించుకోవచ్చు.

జెండరు, వ్యక్తిత్వం గురించి ఈ సెషన్‌లో ఏమేమి స్త్రీ, పురుష లక్షణాలుగా ఆయా వ్యక్తులపై ఎలా ఆపాదించబడుతున్నదీ, అవి స్త్రీలను / పురుషులను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నదీ ఫెసిలిటేటరు వివరించాలి. అదేవిధంగా మతం, కులం, పురాణాలు, ఇతిహాసాలు, ఉద్యోగావకాశాలు, విద్యావకాశాలు, ప్రచారసాధనాలు, రాజ్యం, రాజ్యాంగం అనేవి ఏవిధంగా ప్రభావితం చేస్తాయో కూడా ఉదాహరణలతో వివరిస్తూ చార్టుపై రాస్తూ స్త్రీ, పురుషత్వాలను ఎలా ఆపాదిస్తారో వివరించాలి.

| స్త్రీ | పురుషుడు |
|---|---|
| ఆలనా, పాలనా, పోషణ | తర్కబద్ధం |
| పరాధీనులు, ఉద్వేగాలు | లక్ష్యసాధన |
| సహనం, ఓర్పు | స్వంతంత్రులు, పెత్తందారి ధోరణి |

ముగింపు: "జెండర్ అంటే స్త్రీ, పురుషుల సామాజిక, సాంస్కృతిక నిర్వచనం. సమాజంలో స్త్రీలు, పురుషులు అనే విభిన్న సామాజిక పాత్రలను నిర్దేశించే విధానాన్నే జెండర్ అంటారు".

మనం చూస్తున్న స్త్రీ / పురుష లక్షణాలు ఒక స్త్రీకి / పురుషునికి సంబంధించినవి మాత్రమే కావు. ఇవన్నీ కూడా ఒక వ్యక్తిలోని లక్షణాలు. అయితే వాటికి మనం స్త్రీ /పురుష లక్షణాలుగా ఆపాదించడం జరుగుతుంది. ఒక వ్యక్తి పరిపూర్ణంగా ఎదగడానికి కొన్ని లక్షణాలు అవసరం. ఇదంతా జెండర్ ప్రక్రియలో భాగం.

ఈ విషయాంశాలను చర్చించి అందరు సభ్యులకు లైంగికత్వం, లింగభేదం ఎలా వచ్చింది, తేడాలు ఏమిటి అనేది చివరగా క్రోడీకరించాలి.

**సెక్స్‌కు (లింగభేదం), జెండర్‌కు (లైంగికత్వం) తేడాలు**

ప్రక్రియ: ఫెసిలిటేటరు సభ్యులను సెక్స్‌కు, జెండర్‌కు తేడా ఏమిటని ప్రశ్నించాలి. సభ్యులు చెప్పే అంశాలను బోర్డు లేదా చార్టు పైన వ్రాసి అందరూ చెప్పిన తరువాత వ్రాసిన అంశాలను చదివి క్రోడీకరించాలి.

జెండర్: సమాజం స్త్రీ పురుషులకు నిర్దేశించిన పాత్రల ఆధారంగా స్త్రీలు వేరు, పురుషులు వేరు అని స్త్రీ పురుషుల సామాజిక సాంస్కృతిక నిర్వచనంగా వివరించబడుతున్నది. జెండర్ స్త్రీ, పురుషుల మధ్య సాంఘికమైన తేడాలను

చూపిస్తుంది. సామాజికంగా తేడాచూపే కులం, మతం, జాతి, వయసు, విద్య, సమయం, స్థలం మొదలగు అంశాల ఆధారంగా జెండర్ రూపం మారుతూ వుంటుంది. సామాజికంగా నిర్మించబడిన పురుషాధిక్యం వలన మహిళలు అణచివేయబడ్డారు. జెండర్ సంస్కృతిలో ఒక భాగం. ఇది స్త్రీ పురుషులను వర్గీకరించి స్త్రీ పురుషుల మధ్య సామాజికంగా తేడాను సూచిస్తుంది. ఇది స్త్రీ,పురుషుల మధ్య వున్న అంతరాలను వేలెత్తి చూపడానికి ఉపయోగించే ఒక సాధనం. కార్మికులలో, రాజకీయ వ్యవస్థలో అలాగే గృహ సంబంధ విషయాలలో అసమానతలను చూపించడానికి ఉపయోగపడుతుంది.

సెక్స్: స్త్రీ పురుషుల మధ్య జీవపరమైన తేడాలను సూచిస్తుంది. ఇది సహజసిద్ధమైనది. స్థిరంగా వుంటుంది. మార్పు వుండదు. అంటే ఒకసారి అమ్మాయిగానో లేదా అబ్బాయిగానో జన్మించినపుడు వారు ఎప్పటికీ అలాగే వుంటారు. ఈ క్రింది కొన్ని అంశాలను వివరించండి.

| క్ర.సం. | లైంగికత | జెండర్ |
|---|---|---|
| 1. | లైంగికత ప్రకృతి సహజమైనది | జెండర్ సామాజిక, సాంస్కృతిక పరమైనది |
| 2. | లైంగికత శారీరకమైనది. ఇది పునరుత్పత్తి ధర్మాలలో తేడాలను చూపిస్తుంది. సంబంధిత జననేంద్రియాలలో తేడా వుంటుంది | స్త్రీ పురుషులకు సంబంధించిన లక్షణాలు, ప్రవర్తించే విధానం, పాత్రలు, బాధ్యతలు వంటి వాటిని జెండర్ సూచిస్తుంది |
| 3. | లైంగికత మార్పు లేనిది అది ఎక్కడైనా ఒకే రకంగా వుంటుంది | కాలాన్ని బట్టి, సంస్కృతిని బట్టి, ప్రదేశాలను బట్టి, కుటుంబాలను బట్టి జెండర్ రూపం మారుతూ వుంటుంది |
| 4. | స్త్రీలు, పురుషులు | జెండర్ అంటే లైంగికత్వం (స్త్రీత్వం, పురుషత్వం) |
| 5. | లైంగికత పుట్టుకతో వచ్చేది | పెరిగే పరిస్థితులను బట్టి జెండర్ రూపం వుంటుంది |
| 6. | లైంగికతను మార్చలేము | సామాజిక పరిస్థితులకు అనుగుణంగా జెండర్ మార్పు చెందుతుంది |



జెండర్ అమ్మాయిలు, అబ్బాయిల మధ్య, స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను చూపిస్తుంది. ఇది మగవాడు ఎక్కువ, స్త్రీ తక్కువ అని, మగవాడికి కూలి ఎక్కువ, ఆడవారికి తక్కువ కూలి అని, మగవాడు శక్తివంతుడు, స్త్రీ బలహీనురాలు అని చెప్తుంది. వాస్తవానికి ప్రకృతి అసమానతలను సృష్టించలేదు. కేవలం పునరుత్పత్తి అవయవాలను మాత్రమే అందిస్తుంది. అసమానతలు, ఆధిపత్యాలు, పద్ధతులు, ఆచార వ్యవహారాలు సమాజంచేత సృష్టించబడినవి. అంటే మనమే సృష్టించుకున్నాం. ధనిక, పేద; బ్రాహ్మణులు, శూద్రులు; నల్లజాతీయులు, శ్వేతజాతీయులు; పురుషులు, స్త్రీలు వంటి అంతరాలను సమాజం సృష్టించింది, ఈ అంతరాలు ప్రకృతి పరంగా ఏర్పడినవి కావు.

వాస్తవానికి ప్రతి మనిషిలోను స్త్రీ, పురుషుడు ఇద్దరూ వుంటారు. కాని సమాజం అమ్మాయిలోని అబ్బాయిని, అబ్బాయిలోని అమ్మాయిని ఎదగనివ్వడం లేదు. సమాజం, సంస్కృతి అమ్మాయిలలోను, అబ్బాయిలలోను సారూప్యతలను ప్రోత్సహించడానికి బదులుగా, వారిలోని తేడాలను నొక్కి చెప్పడం జరుగుతుంది. అందువలన అమ్మాయిలు, అబ్బాయిలు విభిన్నంగా పెరగడంతో వారి మార్గాలు కూడా విభిన్నంగానే వుంటాయి. ఈ అసమానతలే స్త్రీ పురుషుల మధ్య విభేదాలకు, ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి.

**వివరణ:** సమాజంలో స్త్రీ పురుషులు అనుభవించే భిన్న హోదాలు సామాజికంగా, సాంస్కృతికంగా నిర్దేశించ బడింది. ఇది మనుషులు చేసింది. ప్రకృతికి దీనికి సంబంధం లేదు. దాదాపుగా ప్రతి రంగంలోనూ మహిళలు పురుషుల కంటే తక్కువ అని భావించడానికి లైంగికత్వమే కారణం, సెక్స్ కాదు. మహిళలకు తమ హక్కులను ఉపయోగించుకునే అవకాశం, స్వేచ్ఛ తక్కువ. వారి హక్కులను ఉపయోగించుకోవడానికి అనేక అడ్డంకులు వుంటాయి. వారి ఆధీనంలో వుండే వనరులు కూడా తక్కువే. పురుషుల కంటే ఎక్కువ గంటలు పని చేస్తారు. కాని వారి పనికి విలువ తక్కువ, వేతనం తక్కువ. పురుషుల చేతిలో, సమాజం చేతుల్లో మహిళలు తీవ్ర హింసకు గురి అవుతారు. వారికి నిర్ణయాధికారాలు వుండవు. బాలికలకు, బాలురకూ; మహిళలకు, పురుషులకూ వేరు వేరు నియమాలను ప్రతి సమాజం నిర్దేశిస్తుంది. ఇవి వారి జీవితాలనూ, భవితవ్యాన్ని శాసిస్తాయి. ప్రస్ఫుటంగా కనపడే కొన్ని నియమాలు.

**బట్టలు :** మహిళలు, పురుషులు వేసుకునే బట్టలు వేరుగా వుంటాయి. కొన్నిచోట్ల ఈ తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కొన్ని ఆచారాలలో మహిళలు ముఖంతో సహా తమ శరీరాన్ని పూర్తిగా పై నుంచి కిందికి కప్పుకోవాలి. వేసుకునే బట్టలు వ్యక్తుల కదలికలను, స్వేచ్ఛను, గౌరవ భావాలను ప్రభావితం చేస్తాయి.

**భాష :** భాష కూడా పితృస్వామ్యానికి చెందినది. అది లింగ వివక్షతను, అసమానతలను ప్రతిబింబిస్తుంది. తరచూ పురుషులకు తమదైన పదజాలం వుంటుంది. పురుషుల కంటె స్త్రీలు తక్కువ అని తెలియచేసే సామెతలు, సూక్తులు అనేకం మన భాషలో వున్నాయి. మన భాషలో కొన్ని పదాలు, పాత్రలు జెండర్‌ను తెలియచేస్తాయి. ఉదా: బాస్, పైలెట్, ఛైర్మన్, సర్, మ్యాన్‌డే, మ్యాన్‌మేడ్, మ్యాన్‌హోల్, హిస్టరీ, పోస్ట్‌మ్యాన్, మేనేజ్‌మెంట్,సేల్స్‌మ్యాన్, మ్యాన్‌పవర్, మ్యాన్‌కైండ్, వన్‌మ్యాన్ ఆర్మీ,ఓంబుడ్స్‌మ్యాన్, మెన్‌ఎట్ వర్క్, జెంటిల్‌మ్యాన్ ... ఈ పదాలన్నీ పురుషులను సూచిస్తాయి. ఈ విషయాలపై చర్చించి సెషన్‌ను ముగించాలి.

**ఎక్సర్‌సైజ్: లైంగికత్వం– పాత్ర, బాధ్యతలు**

ప్రక్రియ: ఫెసిలిటేటరు సభ్యులను రెండు గ్రూపులుగా విభజించి రెండు గ్రూపులకు రెండు రకాల అంశాలను ఇచ్చి పాత్రలుగా నటించమని చెప్పి, రూపకల్పన చేసుకోవడానికి  సమయం ఇవ్వాలి. ఆ అంశాలు: 1. కుటుంబంలో పాత్రలు, బాధ్యతలు  2. భూస్వామి, కూలీలు


ఫెసిలిటేటర్ సభ్యులను పాత్రధారులనుచేసి వారు అభినయం చేసిన పాత్రలను చార్టుపై వ్రాసి అనంతరం చర్చ చేస్తూ విషయాంశాన్ని క్రోడీకరించాలి. క్రింది ప్రశ్నలను ఉపయోగించాలి.

1. ఇప్పటివరకు జరిగిన దానిలో ఏమి అర్థం చేసుకున్నారు?
2. ఎటువంటి పాత్రలను మీరు గమనించగలిగారు?



తరువాత ఫెసిలిటేటర్ ఇలా వివరించాలి. పురుషులు ఇంటి యజమానులుగా, సంపాదించేవారుగా, ఆస్తికి అధిపతులుగా, నిర్వాహకులుగా, వృత్తి, వ్యాపార, మత, రాజకీయాలలో చురుకుగా పాల్గొనేవారుగా భావించపడుతారు. ఇందుకు భిన్నంగా మహిళలు పిల్లల్ని కనిపెంచాలని; వృద్ధులను, బలహీనులను జాగ్రత్తగా చూసుకోవాలని; ఇంటి పని అంతా చేయాలని ఆశిస్తారు. స్త్రీ, పురుషులు అందుకు అనుగుణంగా శిక్షణ పొందుతారు. ఇది వారి విద్యను, ఉపాధికి సిద్ధం కావడాన్ని,  చేపట్టే ఉపాధి వంటి వాటిని ప్రభావితం చేస్తుంది.

పురుషులు, స్త్రీల పాత్రల మధ్య తేడాలు అనేక విధాలుగా వుంటాయి. ఒక్కొక్కసారి నియమాలు అనుకూలంగా వుండి తాత్కాలికంగా బాధ్యతలు తారుమారు అయినా ఎవరూ ఆందోళన పడరు.




స్త్రీ, పురుషుల మధ్య శారీరకపరమైన తేడాలు ఉన్నాయన్నది వాస్తవమే. అయితే స్త్రీ పురుషులకు ఆపాదించిన లైంగికత్వ పాత్రలు ఒక్కొక్కరకంగా వుంటాయి. కాబట్టి పాత్రలకు ఈ తేడాలు కారణం కావు. మారుతూ వుండే (జెండర్ పాత్రలు) లక్షణాలను  స్థిరంగా వుండే లక్షణాల ఆధారంగా (జననాంగాలు, క్రోమోజోములు లేదా సెక్స్) వివరించలేం. శరీర నిర్మాణమే మన పాత్రలను నిర్దేశిస్తూ వుంటే ప్రపంచంలో ప్రతి మహిళ వంట వండుతూ, బట్టలు ఉతుకుతూ, బట్టలు కుడుతూ వుండాలి. కాని ఇలా జరగడం లేదు. వృత్తిపరంగా వంటవాళ్ళు, బట్టలు ఉతికేవాళ్ళు, బట్టలు కుట్టేవాళ్ళలో ఎక్కువమంది పురుషులే.

## 2.2 లైంగికపరంగా శ్రమ విభజన

**ఎక్సర్‌సైజ్: స్త్రీ,పురుషుల రోజువారీ పనుల తీరు**

ప్రక్రియ: ఫెసిలిటేటరు సభ్యుల సంఖ్యను బట్టి 2 లేదా 4 చిన్న గ్రూపులుగా విభజించాలి. ఒక్కొక్క గ్రూపును స్త్రీ పురుషులు ఒక రోజులో (నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్రించే వరకు) ఎవరు ఏఏ పనులుచేస్తారో, ఎంత సేపు

చేస్తారో, మొత్తం ఎన్ని గంటకు పనిచేస్తారో చర్చించి, పెద్దగ్రూపులో వివరించమని చెప్పాలి.

చర్చల అనంతరం గ్రూపుల వారీగా సభ్యులందరికీ వారు వ్రాసిన అంశాలను చదివి వినిపించాలి.దీని ద్వారా స్త్రీలు చాలా రకాల పనులు, చాలాసేపు, ఎక్కువ పనిగంటలు పనిచేస్తారని; పురుషులు కొన్ని రకాల పనులనే, తక్కువ సేపు, తక్కువ పని గంటలు పనిచేస్తారని తెలుసుకోగలుగుతారు.

వివరణ: స్త్రీలు, పురుషులు ఏం చేయాలి, ఏం చేయగలరు అనే విషయంలో సమాజ భావనల ఆధారంగా స్త్రీ, పురుషులకు విభిన్న పాత్రలు, బాధ్యతలు, పనులు కేటాయించడాన్ని లైంగికత్వం ఆధారంగా పని విభజన అంటారు. ఆడపిల్లలకు / మగపిల్లలకు, స్త్రీలకు / పురుషులకు వారి వ్యక్తిగత ఎంపిక, సామర్థ్యాల ఆధారంగా కాకుండా జెండర్ పాత్రలకు అనుగుణంగా విభిన్న పనులు, బాధ్యతలు అప్పగిస్తారు. అన్ని పనులను 3 వర్గాలుగా విభజించవచ్చు అవి (1) ఉత్పత్తి పని (2) పునరుత్పత్తి పని (3) సామాజిక పని.

**1. ఉత్పత్తి పని:** ఉత్పత్తి పనులు వినియోగానికి, (వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, తయారీ, ఉపాధి, స్వయం ఉపాధి మొ॥వి) ; వాణిజ్యానికి (చెల్లింపులు చేసేవి, ఆదాయం చేకూరేవి) సంబంధించినవి. ఇవి వస్తువుల ఉత్పత్తి కోసం అందించే సేవలకు సంబంధించిన పనులుగా వుంటాయి. ఇటువంటి ఉత్పత్తి పనులలో స్త్రీ, పురుషులు ఇద్దరూ భాగస్వాములవుతారు. కాని అధిక భాగం వారి విధులు, బాధ్యతలు లైంగికత్వం ఆధారంగా మారుతూ వుంటాయి. స్త్రీల ఉత్పత్తి పరిమాణాన్ని తక్కువగా, పురుషుల పని కంటే తక్కువ విలువ కలిగినదిగా చూపిస్తారు.





- ఫ్యాక్టరీలలో, ఆఫీసులలో, క్షేత్రాల్లో చేసే పనులన్నీ ఈ కోవలోకి వస్తాయి.
- ఎక్కువ వేతనం, ఎక్కువ నైపుణ్యంతో కూడిన పనులు పురుషులు చేస్తారు.
- వ్యవసాయ రంగంలో స్త్రీలు చేసే ఉత్పత్తి పనికి ఆర్థిక విలువ వుండదు. దానిని ఇంటి పనిలో భాగంగా చూస్తారు. స్త్రీల ఉత్పత్తి పనికి తక్కువ ప్రాముఖ్యతను, తక్కువ విలువను ఇస్తారు.
- పితృస్వామ్య భావాల ప్రకారం కుటుంబ పోషణ బాధ్యత పురుషుడిది. ఆకారణం వల్లనే పురుష ఉపాధికి అధిక







ప్రాముఖ్యత, ప్రాధాన్యతనిస్తారు.అదే కారణంతో స్త్రీ ఆదాయ మార్గాన్ని (ఉపాధి) పొందడం అంత ముఖ్యమైనది కాదని భావిస్తారు.

**2. పునరుత్పత్తి పని:** ఈ పనిలో ఎక్కువ శాతం గృహ నిర్వహణ, పిల్లలను, పెద్దవాళ్ళను జాగ్రత్తగా చూసుకోవడం వుంటాయి. ఇవి రెండు రకాలు . (1) శరీర సంబంధమైనవి (2) సామాజికమైనవి.





- శారీరకంగా పునరుత్పత్తి అంటే కొత్త జీవికి జన్మనివ్వడం. ఈ పనిని స్త్రీలు మాత్రమే చేయగలరు.
- పునరుత్పత్తి పనులు అంటే 'మానవశ్రమను తిరిగి ఉత్పత్తి చేసే పనులు' అని కూడా పేర్కొనవచ్చు. పిల్లల సంరక్షణ, వంట, ఇంటి పని అన్ని గృహ సంబంధమైన పనులు పునరుత్పత్తి పనుల క్రిందికి వస్తాయి. మానవ మనుగడకు ఈ పనులన్నీ చాలా అవసరం. అయినా వాటిని ముఖ్యమైన పనులుగా గుర్తించరు.





ఈ పనులకు ఎటువంటి ఆర్థిక విలువ వుండదు.
అవి కనపడని పనులు, వేతనం లేని పనులు. ప్రపంచవ్యాప్తంగా ఈ రకమైన పనులన్నీ ముఖ్యంగా స్త్రీలు, బాలికలే చేస్తారు.



**3. సామాజిక పనులు:** పుట్టిన జీవి బ్రతకడానికి, పెరగడానికి అవసరమయ్యే సంరక్షణ, పోషణకు సంబంధించిన పనులను సామాజిక పనులుగా చెప్పవచ్చు. అంటే రోజువారీ పనులు, నిత్య జీవనానికి అవసరమయ్యే పనులు. ప్రజాపాలన, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ. వాటిలో పాల్గొనడం, సామాజిక సేవలు, రోడ్లు, విద్య, ఆరోగ్యం వంటి సామాజిక సౌకర్యాలన్నీ కూడా సామాజిక పనులలోకి వస్తాయి. సాధారణంగా స్త్రీ ఇంటి బయట చేసే పని ఇంటికి సంబంధించిన పనిగానే అవుతుంది.
ఉదా: అధిక సంఖ్యలో స్త్రీలు కిండర్ గార్టెన్ లేదా ప్రాథమిక పాఠశాల టీచర్లుగా, నర్సులుగా, ఎయిర్‌హోస్టెస్‌లుగా పని చేస్తుంటారు. అధికారం, పెత్తనం, నియంత్రణ గల ఉద్యోగాలు పురుషులు చేసేవి గాను; రక్షణ, పోషణ, సేవలు గల ఉద్యోగాలు స్త్రీలు చేసేవిగా పరిగణించబడతాయి. ప్రస్తుతం పరిస్థితులలో కొంత మార్పు వచ్చినప్పటికి పూర్తిగా సమానత్వం అనేది అన్ని విషయాలలో స్త్రీలకు రాలేదు. అందువలన ఇప్పటికీ ఈ విషయాలు మాట్లాడవలసిన పరిస్థితులు వున్నాయి.


ఫెసిలిటేటర్ పై వివరణను ముందుగానే చదువుకుని సంబంధిత విషయాలను సభ్యులతో చర్చిస్తూ ప్రస్తుత పరిస్థితులను జోడిస్తూ వారి వారి అభిప్రాయాలను కూడా చర్చలో భాగంగా ఉపయోగించుకోవాలి.

## 2.3 జెండర్ వివక్ష

**ఎక్సర్‌సైజ్: తాడుతో బంధించడం**


ప్రక్రియ: ఫెసిలిటేటరు ముందుగా వివక్ష అంటే ఏమిటో సభ్యులతో చర్చ చేయాలి. సభ్యులు చెప్పిన అంశాలను చార్టు పైన కాని, బోర్డు పైన కాని వ్రాయాలి. వివక్ష అంటే కులం, జాతి, సంపద మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకుని కొందరిపట్ల ఒక రకంగా, మరి కొందరిపట్ల మరొక రకంగా ప్రవర్తించడం. సమాజంలో, పాఠశాలల్లో, కార్యాలయాలలో, పొలం పనులలో ఇలా అనేక చోట్ల వివక్ష ఎదురవుతుంటుంది. జెండరు వివక్షపై రకరకాల అభిప్రాయాలను తీసుకోవాలి.

ఫెసిలిటేటర్ సభ్యులలో నుంచి ఒక స్త్రీని హాలు మధ్యకు వచ్చి నిలబడమని చెప్పాలి. మిగతా సభ్యులలో ముందుగా ఒకరు వచ్చి ఆ మహిళను ఒక తాడుతో ముడివేయాలి. స్త్రీలపై వున్న కట్టుబాట్లలో ఏదో ఒక కట్టుబాటును చెప్పి ఆ ముడిని ఆ కట్టుబాటుగా పేర్కొనాలి. ఇలా సభ్యులందరూ ఒక్కొక్కరుగా వచ్చి ఒక్కొక్క ముడివేసి ఒక్కొక్క కట్టుబాటును చెప్పాలి. అందరూ మడివేయడం అయిన తర్వాత ఆమె కాళ్ళకు, చేతులకు, మెడకు ... ఇలా ఒంటి నిండా కట్టుబాట్ల ముడులే వుంటాయి.తాడు కట్టించుకున్నవారిని, కట్టినవారిని వారు ఈ కట్టివేతను గురించి ఏమి భావిస్తున్నారో చెప్పమని అడగాలి. మళ్ళీ ఎవరికి వారు వచ్చి వారు వేసిన ముడిని విప్పమని చెప్పాలి. ఇంకా కొన్ని ముడులు వుండగానే ఆమె తనంత తానుగానే మిగతా ముడులను వదిలించుకునే ప్రయత్నం చేయాలి. ఇది చైతన్యానికి, అవగాహనకు సంకేతం.ఈ ప్రక్రియ మొత్తాన్ని ఒక పురుష సభ్యునితో కూడా నిర్వహించాలి. అంటే, హాలు మధ్యలో పురుషుడు నిలబడి వుంటే మిగతా సభ్యులు వచ్చి కట్టుబాట్ల ముడులు వేయడం, విప్పడం. అయితే, స్త్రీతో పోలిస్తే పురుషుడికి ఈ ముడులు చాలా తక్కువగా వుంటాయి. ఫెసిలిటేటర్ అన్ని కట్టుబాట్లను చార్టుపైన వ్రాయాలి. అందరూ అయిన తరువాత వివక్ష గురించి చర్చించి క్రింద ఇచ్చిన వివరణను చెప్పాలి.



వివరణ: విద్య లేదా ఆధునికీకరణ లేదా అభివృద్ధితో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వాన్ని తీసుకువచ్చే ప్రయత్నం తక్కువగా వుంటుంది. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను అది పట్టించుకోదు, సమర్థిస్తుంది. కొనసాగేలా చేస్తుంది. పాఠ్య పుస్తకాలను విశ్లేషించిన అనేక సందర్భాలలో వాటిల్లో జెండర్ వివక్ష ఉందని, పురుషులకు అనుగుణంగా అవి వున్నాయని నిరూపితమైంది. స్త్రీకి ఇన్ని రకాల కట్టుబాట్లు సమాజం ఏర్పరిచిందని ప్రతి ఒక్కరికి కనువిప్పు కలిగేలా ఫెసిలిటేట్ చేయాలి.

# జెండర్ ట్రీ




స్త్రీ తలచుకుంటే సమాజం ఏర్పరచిన నియమాలను, కట్టుబాట్లను తొలగించుకోగలదని, అదేవిధంగా సమాజం కూడా స్త్రీ పురుష సమానత్వం ఏర్పడాలంటే తనంతతానుగా (అంటే ఏ సమాజమైతే నియమాలను, కట్టుబాట్లను ఏర్పరిచిందో ఆ సమాజమే) తొలగించడం వలన కూడా సమానత్వాన్ని సాధించవచ్చని ఈ ఎక్సర్‌సైజ్ ద్వారా వివరించాలి.

## 2.4 లైంగికత్వం:మూల కారణాలు, ప్రభావాలు

**ఎక్సర్‌సైజ్: జెండర్ ట్రీ**

ఫెసిలిటేటర్ సభ్యులందరిని మూడు లేదా నాలుగు గ్రూపులుగా విభజించి, జెండర్ ట్రీకి సంబంధించిన ఒక జాబితాను తయారుచేసి సభ్యులందరితో చర్చించమని చెప్పాలి. 'మూల కారణాలు, ప్రభావాల' తో ఆ జాబితా రూపొందించాలి. చెట్టుకు ఆధారం వేళ్ళు. అ వేళ్ళ ఆధారంగా ఆకులు,రెమ్మలు,కొమ్మలతో మొక్కగా, చెట్టుగా ఎదిగి పూవులు, కాయలు, పండ్లు ఇస్తుంది. ఆ వేళ్ళ ప్రభావం వల్లనే వివిధ దశలలో ఇవన్నీ ఏర్పడ్డాయి.అదే విధంగా లైంగిక వివక్షకు కొన్ని మూలకారణాలు వున్నాయి; ఆ మూల కారణాల వల్ల కలిగే ప్రభావాలు అనేకం వున్నాయి. లైంగిక వివక్ష మూల కారణాలను, ప్రభావాలను సభ్యులు చిన్న గ్రూపులలో నిశితంగా, క్షుణ్ణంగా చర్చించి జెండర్ ట్రీ తయారుచేయమని చెప్పాలి.చెట్టు వేర్లను మూలకారణాలుగా; కాండాన్ని జెండర్‌గా; ఆకులు, రెమ్మలు, కొమ్మలు, పూవులు, కాయలు, పండ్లు ఆ కారణాల వల్ల ఏర్పడిన ప్రభావాలుగా జెండర్ ట్రీ ని తయారుచేయాలి. తరువాత పెద్ద గ్రూపులో వాటిని ప్రదర్శించాలి.

మూలకారణాలు: పితృస్వామ్యం, మతం, కులం, సామాజిక-సాంస్కృతిక నేపథ్యం, సంప్రదాయాలు, రాజకీయం, క్యాపిటలిజం (పెట్టుబడిదారీ వ్యవస్థ) మొదలగునవి.

ప్రభావాలు: బాల్య వివాహాలు, బాలికల పరిమిత విద్య, అమ్మాయిల కదలికలపైన, వారి చర్యలపైన ఆంక్షలు; వివాహాలు, ఇతర ప్రధాన నిర్ణయాలు పురుషులు చేయడం; మహిళలకు ఎటువంటి ఆస్తులు ఇవ్వకపోవడం; పునర్వివాహాల, వితంతు వివాహాల నిషేధం; గృహభారం అంతా మహిళలపై వేసి ఒత్తిడి పెట్టడం; వరకట్న వేధింపులు; మహిళలకు పరిమితమైన వనరులు; మహిళలపై వేధింపులు (ఈవ్ టీజింగ్), లైంగిక వేధింపులు, అత్యాచారాలు; గృహహింస, మహిళలను, అమ్మాయిలను అక్రమంగా రవాణా చేయడం, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టడం, బలవంతపు వివాహాలు, రాజకీయాలలో పాల్గొనే అవకాశాలు మహిళలకు చాలా తక్కువగా వుండటం, బాల కార్మిక వ్యవస్థ మొదలగునవి. అంతేకాకుండా ఇంకా ఎన్నో రకాల అణచివేతలు, దోపిడీ, హింస వలన మహిళలకు, అమ్మాయిలకు చాలా హాని జరుగుతుంది.

ఈ మూల కారణాలు కేవలం లక్షణాలు కాదు, వీటిని అందరూ పరిష్కరించాల్సిన అవసరం వుందని అర్థం చేసుకునే విధంగా ఫెసిలిటేటర్ చర్చను ఫెసిలిటేట్ చేయాలి.

మనం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలన్నీ కూడా పైకి కనిపించే అప్పటి ప్రభావాలను మాత్రమే ఎదుర్కొనడానికి చేసే ప్రయత్నాలే కాని, లైంగికత్వ మూలకారణాలను ఎదుర్కోవడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. కాబట్టి మూలకారణాలను సుస్థిర కార్యాచరణ ప్రణాళికతో ఎదుర్కొన్నపుడు మాత్రమే లైంగిక సమానత్వ సాధనకు, సమాజంలో స్త్రీలు తమ హక్కులను సాధించుకోవడానికి కొంతైనా ప్రయత్నం జరుగుతుంది అని వివరించి ముగించాలి.


**ఎక్సర్‌సైజ్: లైంగికత్వం (జెండర్), లింగభేదం (సెక్స్) క్విజ్**

ఫెసిలిటేటర్ సభ్యులను రెండు గ్రూపులుగా చేసి లైంగికత్వాన్ని గురించి ఎంత అర్ధంచేసుకున్నారో తెలుసుకోవడానికి ఈ క్రింద ఇచ్చిన క్విజ్ ఎక్సర్‌సైజ్ ను ఉపయోగించాలి. ఒక్కొక్క గ్రూపును ఒక్కొక్క ప్రశ్న అడగాలి. ఏది లైంగికత్వం, ఏది లింగభేదమో సభ్యులు సమాధానం చెప్పాలి.

1. పురుషులతో పోల్చినపుడు స్త్రీలకు తక్కువ వేతనం వుంటుంది
2. స్త్రీలు రాజకీయాలలో పనికిరారు
3. పురుషులకు స్త్రీల కంటే శరీరంపై ఎక్కువ జుట్టు వుంటుంది
4. స్త్రీలు వ్యాపారం చేయలేరు
5. స్త్రీలు బిడ్డలకు జన్మనిస్తారు
6. స్త్రీలు బిడ్డలకు రొమ్ముపాలు పడతారు. పురుషులు సీసా పాలు పడతారు.
7. స్త్రీలు చెట్లు ఎక్కలేరు
8. పురుషులకు మీసాలు వుంటాయి. స్త్రీలకు వుండవు
9. కౌమారదశలో అబ్బాయిల గొంతు మారుతుంది
10. స్త్రీలు కోపం తెచ్చుకోకూడదు. పురుషులు ఏడవకూడదు
11. స్త్రీలలో ఎక్స్ ఎక్స్ క్రోమోజోములు, పురుషులలో ఎక్స్, వై క్రోమోజోములు వుంటాయి
12. స్త్రీలు సున్నితంగా ప్రేమగా వుంటారు. పురుషులు కఠినంగా వుంటారు
13. స్త్రీ, పురుషులలో వుండే పక్కటెముకల సంఖ్యలో తేడా వుండదు
14. పురుషులు హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. స్త్రీలు నిర్ణయాలు చేయలేరు
15. పురుషుల సంపాదనలో స్త్రీలు 70% మాత్రమే సంపాదిస్తారు
16. స్త్రీలకు ప్రతి నెల ఋతుక్రమం వుంటుంది
17. పురుషులే సంపాదించేవారు, కుటుంబ పెద్ద
18. స్త్రీలకు గడ్డం వుండదు
19. పురుషులే ధైర్యవంతులు, బలమైనవారు
20. స్త్రీ పురుషులకు భిన్నమైన పునరుత్పత్తి అవయవాలు వుంటాయి
21. పురుషులకు గర్భాశయం వుండదు
22. స్త్రీలను భగవంతుడు పురుషులను సంతోషపెట్టడానికి, నియంత్రించడానికి సృష్టించాడు
23. పురుషులు పిల్లలకు జన్మనివ్వలేరు
24. స్త్రీలు ఎల్లప్పుడూ సౌందర్యం పైన దృష్టి పెడతారు
25. అమ్మాయి పుట్టడానికి పురుషులే కారణం
26. అమ్మాయి పుట్టడానికి స్త్రీలే కారణం
27. స్త్రీలు కేవలం ఇంటి పని మాత్రమే చేయగలరు, బయటి పని చేయలేరు
28. పురుషులు ప్రధమ పౌరులు, స్త్రీలు ద్వితీయ శ్రేణి పౌరులు
29. స్త్రీల తల, ఎముకలు, ఆకారం పురుషుల కంటే భిన్నంగా వుంటాయి
30. మెదడులో ఎడమవైపు భాగాన్ని పురుషులు ఉపయోగిస్తారు, స్త్రీలు కుడి, ఎడమ రెండుభాగాలను సమానంగా ఉపయోగిస్తారు

'స్త్రీ', ఈ పదం చాలా శక్తివంతమైనది. నిత్యం పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ బాధ్యతాయుతమైన పాత్ర, బాధ్యతను పోషిస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నిస్వార్ధంతో మహిళలు అందించే అద్భుతమైన సహకారం లేకపోతే ఈ ప్రపంచం ఇంత గొప్పగా వుండేది కాదేమో. "ఒక ఇంటిలో స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబం, అలా అన్ని కుటుంబాలు చదువును పొంది, మొత్తం దేశమే బాగుపడుతుంది" అని ఒక సామెత. మహిళలు విభిన్న పాత్రలు, బాధ్యతలను పోషించే భారం కలిగి వుంటారు.

స్త్రీ ఎంతోశక్తివంతురాలు.పురుషుడు చేయగలిగిన ప్రతి పనిని స్త్రీ చేయగలదు. స్త్రీలు చాలా ఆత్మవిశ్వాసం కలిగి వుండి మానవ జీవితంలో ప్రతి పనిలోను సాధ్యాసాధ్యాలను తరిచి చూడగలరు.మన పురాణ గాథల్లో, సంస్కృతిలో స్త్రీ ఎంతో శక్తి కలిగిన, ప్రాముఖ్యత కలిగిన వ్యక్తిగా చూపబడినది. దుర్గామాత, లక్ష్మీదేవి, సరస్వతి ఇంకా ఎంతోమంది దేవతలు ఇందుకు ఉదాహరణ.



# అధ్యాయం 3 : సమాజంలో లైంగికత్వం (జెండర్)

**ఉద్దేశం:** పితృస్వామ్య వ్యవస్థ గురించి, స్త్రీ వాదాన్ని గురించి, స్త్రీ వాద దృక్పథంలోని వివిధ కోణాల గురించి తెలుసుకోవడంద్వారా లైంగికత్వాన్ని గురించిన అవగాహనను మరింత పెంపొందించుకోవడం.

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 3.1 | పితృస్వామ్యం, స్త్రీవాదం | చర్చ | 40 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 3.2 | అధికారం చెల్లుబాటయ్యే తీరు | చర్చ, రోల్ ప్లే | 40 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 3.3 | పురుషత్వం, స్త్రీత్వం | ఎక్సర్‌సైజ్, చర్చ | 40 ని॥లు | కార్డులు |
| 3.4 | బాలురకు, బాలికలకు సామాజిక కట్టుబాట్లు | గ్రూప్ ఎక్సర్‌సైజ్,చర్చ | 40 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 3.5 | వనరుల అందుబాటు, | వనరులపై అధికారం | 40 ని॥లు | చార్టులు, మార్కర్లు |

## 3.1 పితృస్వామ్యం, స్త్రీవాదం

### పితృస్వామ్యం





ఫెసిలిటేటర్ సభ్యులతో పితృస్వామ్య వ్యవస్థ గురించి భాగస్వామ్య చర్చ చేయాలి. కొంతమంది సభ్యులు ఈ వ్యవస్థ గురించి చాలా సందర్భాలలో విని వుంటారు కాబట్టి దానిపై వారి అభిప్రాయాలను సేకరించి సభ్యులందరితోను సుదీర్ఘమైన చర్చ చేయాలి. తరువాత విషయాంశాలను వివరిస్తూ క్రోడీకరించాలి.

వివరణ: పితృస్వామ్యం అనగా తండ్రి పాలన (పితృ:తండ్రి, స్వామ్య:పాలన). సమాజంలోని మొత్తం సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కుటుంబం నుండి తండ్రి శక్తియుక్తుల ద్వారా విస్తరించబడినదని చెప్పవచ్చు. పురుషులు అన్ని రకాల శక్తులను నియంత్రించగలుగుతారు. ఉదాహరణకు మిలటరీ, పరిశ్రమలు, సాంకేతికం, రాజకీయాలు, ఆర్థికం, విద్య, పోలీసువ్యవస్థ, మతసంబంధమైన వ్యవస్థ అన్నీ పురుషుల చేతిలోనే వుంటాయి. మహిళల




పునరుత్పత్తి సామర్థ్యం పురుష ప్రయోజనాలకోసం, లైంగిక వాంఛల కోసం ఏర్పడిందిగా పితృస్వామ్యం నిర్వచిస్తుంది.

పితృస్వామ్యం ఏదో ఒక రోజులో రూపొందిన వ్యవస్థ కాదు, దాదాపు 5000 సంవత్సరాలుగా పరిణామం చెందుతూ, బలపడుతూ వచ్చిన వ్యవస్థ. కులమత వ్యవస్థతో పాటే పితృస్వామ్య వ్యవస్థ ప్రాణంపోసుకున్నది.




- స్త్రీ, పురుష సంబంధాలను అర్థం చేసుకోవడానికి పితృస్వామ్యాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. పితృస్వామ్యం కారణంగానే జెండర్ సంబంధాలు అసమానంగా వున్నాయి. పురుష ఆధిపత్యాన్ని సూచించడానికి సాధారణంగా పితృస్వామ్యం అన్న పదాన్ని వాడుతుంటారు.
- ఒక పురుషునికి చెందిన స్త్రీలు, యువకులు, పిల్లలు, బానిసలు, పనివాళ్ళు అతడి ఆధీనంలో ఉండటాన్ని ఇది సూచిస్తుంది.



- పితృస్వామ్యం అంతటా, అన్ని కాలాల్లో ఒకేరకంగా ఉండదు. ఒకే సమాజంలో భిన్నవర్గాల మధ్య అది భిన్నంగా వుండవచ్చు. ఉదా : మన అమ్మమ్మలు అనుభవించిన పితృస్వామ్యం ఈనాటి పితృస్వామ్యం ఒకటి కాదు.
- భూ స్వామ్య స్త్రీలు, అణచివేతకు గురైన వర్గాల స్త్రీలు ఎదుర్కొనే పితృస్వామ్యం ఒకే రకమైనది కాదు. అమెరికాలోని స్త్రీలు, భారతదేశంలోని స్త్రీలు ఎదుర్కొనే పితృస్వామ్యం ఒకటి కాదు.
- పితృస్వామ్యం ఒక సామాజిక వ్యవస్థ. ఒక సిద్ధాంతం లేదా నమ్మకాల విధానం. దీని ప్రకారం పురుషులు ఉన్నతులు.
- పితృస్వామ్య సిద్ధాంతాన్ని తయారుచేసి, కొనసాగించడంలో మతాలు ముఖ్యమైన పాత్ర పోషించాయి.



- పురుషులను బలవంతులుగాను, నిర్ణయాలు తీసుకునే పాత్రలలోను; స్త్రీలను పరాధీనులుగా ఈర్ష్యాపరులుగా, అంతులేని వస్తు వ్యామోహం ఉన్నవారిగా చిత్రీకరిస్తూ నేటి ప్రసార మాధ్యమాలు, విద్యాసంస్థలు కూడా పితృస్వామ్య భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాయి.
- స్త్రీల జీవితాలకు, సమాజానికి సంబంధించిన ఈ దిగువ అంశాలు పితృస్వామ్య ఆధీనంలో, అదుపులో ఉన్నాయని చెప్పవచ్చు.
  - స్త్రీల ఉత్పాదన శక్తి లేదా శ్రమశక్తి
  - స్త్రీల పునరుత్పత్తి శక్తి
  - స్త్రీల సామాజిక స్థాయి
  - స్త్రీల కదలికలు
  - ఆస్తి ఇతర ఆర్థిక వనరులు
  - సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సంస్థలు
- సమాజంలోని ప్రధాన వ్యవస్థలైన కుటుంబం, మతం, చట్టం, రాజకీయం, విద్య, ఆర్థికం, ప్రసార సాధనాలు అన్నీ తమ పితృస్వామ్య స్వభావాన్ని వెల్లడిస్తూ, పితృస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్నాయి.
- పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలకు బొత్తిగా ఎటువంటి హక్కులు, అధికారాలు, వనరులు లేవని కాదు. ఏ అసమాన వ్యవస్థ అయినా కొనసాగాలంటే అణచివేతకు గురయ్యే వారిలో కూడా కొందరు దాని ద్వారా లాభపడాలి, అందులో పాల్గొనాలి. ఇది పితృస్వామ్యానికీ వర్తిస్తుంది.
- స్త్రీలు అధికార స్థానాలకు ఎదిగారు. నియంత్రణ స్థానంలో తాత్కాలికంగానైనా ఉన్నారు. కొద్దో గొప్పో ప్రయోజనాలను సాధించుకోగలిగారు.అయితే ఇది కేవలం తాత్కాలికం మాత్రమేనని, పితృస్వామ్యాన్ని నిలబెట్టడానికి ఉపయోగపడే ఒక తంతులాంటిదేనని గ్రహించాలి.
- తమకున్న హక్కులను కాపాడుకోవడానికి స్త్రీలు తమ స్థానాన్ని నిరంతరం నిలబెట్టుకుంటూ ఉండాలి.

ఈ విషయాలన్నీ సభ్యులతో చర్చించి క్రోడీకరించాలి.

**స్త్రీవాదం**

పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నించే ఒక ఆయుధం స్త్రీవాదం. స్త్రీవాదులు స్త్రీలు మాత్రమే కాదు పురుషులు కూడా. ఉదా: గాంధీ, వీరేశీలింగం పంతులు.రాజారాం మోహనరాయ్, పెరియార్ రామస్వామి మొదలైన వారు. స్త్రీవాదం ఏ ఒక్క సైద్ధాంతిక సూత్రీకరణల ఆధారంగా రూపొందలేదు. అన్ని సమయాలకు, అందరు మహిళలకు వర్తించే స్త్రీవాదానికి నిర్దిష్ట స్వరూపం లేదా నిర్వచనం లేదు. స్త్రీవాదం అనేది వాస్తవాలు, అవగాహనలు, పరస్పర చర్యల ప్రాతిపదికపై, చారిత్రకంగా, సాంస్కృతికంగా రూపొందినది. కాబట్టి దాని నిర్వచనం సందర్భానికి అనుగుణంగా మారగలుగుతుంది. నీరు ఏ పాత్రలో పోస్తే ఆ ఆకారాన్ని పొందేవిధంగా, స్త్రీవాదం కూడా స్థానిక పరిస్థితులను, సమస్యలను బట్టి వివిధ మార్గాలలో వ్యక్తీకరించబడుతుంది. అందువల్లనే మొట్టమొదటిసారిగా 17వ శతాబ్దంలో వ్యక్తమైన స్త్రీవాద నిర్వచనం ఒకరకంగాను, 1990 నాటి స్త్రీవాద నిర్వచనం మరొక రకంగాను వుంది.

**స్త్రీవాదంలోని రకాలు**

**భావన:** ఎన్నో తరాలుగా అణచివేతకు గురిఅయిన స్త్రీలు నవీన కాలంలో వారి అభ్యున్నతి కోసం, సమాజంలోని పరిణామాలను స్త్రీలకు సహాయపడేలా చేయడం కోసం పుట్టినది స్త్రీవాదం. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా మాటలలో "ప్రపంచాన్ని స్త్రీల కోణం నుండి చూడడమే స్త్రీవాదం". ఈ స్త్రీవాదం వివిధ భావజాలాలకు అనుగుణంగా వివిధ రకాలుగా ఉండటం గుర్తించవచ్చు.

**1. ఉదార స్త్రీవాదం:** స్త్రీలకు సౌకర్యాలు పెంచడం ద్వారా అసమానత తొలగిపోతుందని చెబుతుంది. సరైన విద్య, ఎక్కువ ఉద్యోగాలు, ఎక్కువ ప్రాతినిధ్యం పొందడం వలన స్త్రీలకు మేలు కలుగుతుందంటుంది ఉదార స్త్రీవాదం.

**2. మార్క్సిస్టు స్త్రీవాదం:** మార్క్సిస్టు వాదానికి అనుగుణంగా వుంటుంది. ఎప్పుడైతే ధనిక, పేద అనే వర్గాలు రూపుమాపబడుతాయో అప్పుడు సహజంగానే జెండరు తారతమ్యాలు తగ్గిపోతాయి అంటుంది మార్క్సిస్టు స్త్రీ వాదం.

**3. సామాజిక స్త్రీవాదం:** వర్గ భేదాలు, లింగ భేధాలు రెండింటిలో సానుకూలమైన మార్పు తీసుకు రావాలి అని అంటుంది సామాజిక స్త్రీవాదం. ఇందులో వర్గం, కులం, జాతి, మతం లాంటి విషయాలపైన కూడా పని చేయడం వల్ల జెండరు భేదాలు తగ్గుతాయని చూడడమే స్త్రీవాద కోణం.

**4. విప్లవ స్త్రీవాదం:** విప్లవ స్త్రీవాదంలో లింగభేదం ప్రధాన అంశం. పురుషుడే స్త్రీకి మొదటి శత్రువు. విప్లవ స్త్రీవాదం స్త్రీల కోసం ప్రత్యేక సంస్కృతిని, ప్రత్యేక సంగీతాన్ని, ప్రత్యేక సాహిత్యాన్ని, ప్రత్యేక చిత్రలేఖనాన్ని రూపొందించింది. ఈ విధానం స్త్రీలకు ఎనలేని సేవలను అందించింది.

**5. ప్రకృతి స్త్రీవాదం** : స్త్రీకి, ప్రకృతికి అవినాభావ సంబంధం వుంది. ప్రకృతిని దోచుకునే వారు స్త్రీలను కూడా దోచుకుంటున్నారు. కాబట్టి రెండింటిని ఎదుర్కోవాలి అంటుంది.

**6. గాంధేయ స్త్రీవాదం:** గాంధీజీ సిద్ధాంతాలపై ఆధారపడి స్త్రీల అభ్యున్నతి కోసం పాటుపడే విధానమే గాంధీ స్త్రీవాదం.

**7.మతపరమైన స్త్రీవాదం:** మతంలో తగిన మార్పులు తీసుకురావడంద్వారా లైంగిక వివక్షను రూపుమాపవచ్చునని ఈ వాదం చెబుతుంది.

**స్త్రీవాద సూత్రాలు**

- స్త్రీ పురుషులు మార్పు పొందగలిగే సామర్థ్యం కలిగి వుంటారు.
- ప్రతి విషయం స్త్రీ పురుషులిద్దరికీ సంబంధించినదే. ఏ విషయమైనా ఇద్దరిపైనా ప్రభావం చూపుతుంది. ప్రతి విషయం వ్యక్తికి, సమాజానికి, దేశానికి సంబంధించినదే. అందువలన స్త్రీల సమస్యలను పరిష్కరించడానికి స్త్రీ పురుషులిద్దరూ ముందుకు రావాలి.
- ప్రతి అనుభవమూ లైంగికత్వానికి సంబంధించినదే. ఈ లైంగికత్వ అనుభవాలు ఇతర గుర్తింపులతో అనుసంధానమైనవి.
- సంస్కృతి, ఆహారపు అలవాట్లు లేదా మరే ఇతర అంశాలైనా మూసపోసినట్టు ఒకే రకంగా వుండాలనడాన్ని స్త్రీవాదం వ్యతిరేకిస్తుంది. వైవిధ్యాన్ని, అనేకత్వాన్ని నమ్ముతుంది.
- స్త్రీవాదం అన్ని రకాల ఆధిపత్యాలకు వ్యతిరేకం.
- స్త్రీవాదం ప్రకృతిలోను, సమాజంలోను దోపిడీకి తావు వుండకూడదంటుంది. రెండింటికీ పరస్పర లాభం చేకూర్చే వ్యవస్థను స్థాపించే దిశగా పని చేస్తుంది.
- స్త్రీవాదం స్వీయ మార్పు కన్నా మించినదేదీ లేదని నమ్ముతుంది.

సమాజంలో స్త్రీ పురుషులను ఇద్దరినీ ప్రభావితం చేయని జెండరు అంశాలు లేవు. ప్రతి అంశము వ్యక్తులు, సమాజం, దేశాన్ని నడిపే విధానాలు, పద్ధతులు ఏవైనా లైంగిక సమానత్వం కోసమే కృషి చేయాలి. అంతేకాని ఏదో ఒక లింగత్వంపై పక్షపాత ధోరణితో వ్యవహరించరాదని ఫెసిలిటేటర్ సభ్యులకు వివరించాలి.

## 3.2 అధికారం చెల్లుబాటయ్యే తీరు

ఫెసిలిటేటర్ సభ్యులను రెండు గ్రూపులుగా విభజించి అధికారాలు తెలియజేసే విధంగా రోల్ ప్లే చేయించాలి.

**నటించే (రోల్ ప్లే) అంశాలు**

1. పాత్రలు: పురుషులు, పురుషులు
   - గుడిలో బ్రాహ్మణుడు, హరిజనుడు
   - ఆఫీసులో అధికారి అదే ఆఫీసులో గుమస్తా
   - భూస్వామి, భూస్వామి భూమిని కౌలుకు తీసుకున్న రైతు
2. పాత్రలు: స్త్రీలు, స్త్రీలు
   - భూస్వామి భార్య, ఆ ఇంటిలో పని చేసే మహిళ
   - పెళ్ళిలో పెళ్ళికొడుకు తల్లి, పెళ్ళికూతురు తల్లి
3. పాత్రలు: పురుషులు, స్త్రీలు
   - భారతదేశంలో హిందూ కుటుంబంలో పురుషుడు / భర్త, ఆ ఇంటిలో భార్య / స్త్రీ
   - కూతురిని ఒక ఇంటికి ఇచ్చిన తండ్రి / ఆ కూతురి అత్తగారు

సమాజంలో అధికారం కొందరిచేతులలోనే కేంద్రీకృతమై వుంటుంది. ఇతరులు నిస్సహాయులుగా ఆ అధికారానికి తలవంచి జీవించవలసి వుంటుంది. ఈ క్రింది కొన్ని ఉదాహరణలు ఈ విషయాన్ని వివరిస్తాయి.

| అధికారం చెలాయించేవారు | అధికారానికి తలవంచే వారు |
|---|---|
| అజమాయిషీ చేసేవర్గం/కులం | అణచివేయబడిన వర్గాలు/కులాలు |
| యజమాని | ఉద్యోగి |
| భూస్వామి | కూలి |
| పురుషుడు | స్త్రీ |
| భర్త | భార్య |
| ధనికులు | పేదవారు |
| పెద్దవారు | చిన్నపిల్లలు |
| చదువుకున్నవారు | చదువులేనివారు |
| అన్న / తమ్ముడు | అక్క / చెల్లెలు |
| తండ్రి | తల్లి |
| అబ్బాయి తలిదండ్రులు | అమ్మాయి తలిదండ్రులు |
| అత్త | కోడలు |
| టీచర్ | విద్యార్థి |

పైన పేర్కొన్న అంశాలపై సభ్యులచే చిన్న రోల్ ప్లే చేయించి గమనించిన అంశాలను సభ్యులందరితో చర్చించాలి. చర్చలో వచ్చిన అంశాల ఆధారంగా ఎవరు ఎవరిపై ఎటువంటి అధికారాన్ని చెలాయిస్తున్నారు, అధికారం ఎవరి చేతుల్లో వుంది, అధికారం లేనివాళ్ళు, వాళ్ళ హక్కులను ఎలా పోగొట్టుకున్నారు, వారు లైంగిక వివక్షకు ఎలా గురికాబడుతున్నారు, వారి పరిస్థితి ఏమిటి, అనే అంశాలపై చర్చ చేయించాలి. లైంగిక వివక్షలో ఆలోచనా విధానం ఎలా వుంది. ఆ ఆలోచన మార్చుకునే విధంగా ప్రతి ఒక్కరు ఎలా పని చేయాలి అని ఆలోచించాలి.ముఖ్యంగా

సమాజంలో ఎక్కువగా అణచివేతకు గురవుతున్న వర్గాలవారు వారికి అందవలసిన అధికారాలను, హక్కులను పొందగలిగే విధంగా మన కార్యక్రమాలు వుండాలి. ఈ విషయం ఫెసిలిటేటర్ స్పష్టంచేయాలి.

**అధికారం మూలాలు, సూచికలు**

ఈ విషయాంశము అధికారంపైన, సంబంధిత అంశాలపైన దృష్టి కేంద్రీకరించింది. ఫెసిలిటేటర్ సభ్యులందరిని అధికారానికి సంబంధించిన మూలాలను గుర్తించి వ్రాయమని చెప్పాలి. సభ్యులు ఈక్రింద ఇచ్చిన మూలాలను గుర్తించి వ్రాయగలిగే విధంగా ఫెసిలిటేట్ చేయాలి.


| | |
|---|---|
| వ్యక్తిత్వం | స్థానము |
| విద్య | అర్హత |
| ప్రభావితం చేయగలిగే నైపుణ్యాలు | కులం |
| కమ్యూనికేషన్ నైపుణ్యాలు | ఆస్తి |
| సమాచారం | అవగాహన |
| పరిచయాలు | ప్రతిపత్తి |
| ధైర్యం | కుటుంబ నేపథ్యం |
| నైపుణ్యాలు / నిపుణత | రాజకీయాలు |
| ఇతరులకు సహాయపడడం | దోపిడీ |
| బాధ్యతలను కలిగి వుండడం | మతం |
| ఐకమత్యం / సంబంధాలు | శారీరక బలం |
| పరిజ్ఞానం | అనుభవం |
| ఇతరులను ప్రోత్సహించడం | స్థాయి |
| విశ్వాసం | సాంకేతికత అందుబాటు |
| ఆర్థికభద్రత | మౌలిక వసతుల అందుబాటు |
| మానసిక శక్తి | ప్రభుత్వ ఉద్యోగం |
| సంఘం కార్యాచరణ | డబ్బులు |
| మంచి ఆరోగ్యం, నిజాయితీగా వుండటం | వయస్సు |

ఫెసిలిటేటర్ మంచి మానవ లక్షణాలైన ఇతరులకు సహాయపడటం, నిజాయితీ, ఐక్యత, సంఘ కార్యాచరణ మొదలైన అంశాల గురించి ఆసక్తికరమైన విశ్లేషణ చేయాలి. వీటిని కూడా శక్తి వనరులుగా భావించి అభివృద్ధి పథంలో పనిచేసే సంస్థలు వీటిని సామాజిక శక్తులుగా స్వీకరించి పని చేయాలి. అంతేకాని వివక్షతోను, దోపిడీతోను పని చేయకూడదు అని వివరించాలి.

సభ్యులందరి దగ్గర నుంచి విషయాంశాలను రాబట్టి వాటిని క్రోడీకరించి అధికారం ఏవిధంగా ఒకరి చేతులలో వుంటుందో, దానికి దారి తీసే సామాజిక పరిస్థితులు ఏవిధంగా వుంటాయో నటించే (రోల్ ప్లే) అంశాలను వివరిస్తూ ఈ విషయాంశాన్ని క్రోడీకరించాలి.

## 3.3 పురుషత్వం, స్త్రీత్వం

లైంగికత్వ సామాజిక నిర్మాణంలో సమాజం స్త్రీలకు కొన్ని, పురుషులకు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను ఆపాదించింది. అవే లక్షణాలకు లోబడి ప్రవర్తించే విధంగా మానసికంగా వారిని సిద్ధం చేస్తుంది. ఒక లక్షణం గురించి మాట్లాడినపుడు అది లైంగికత్వానికి సంబంధించినదిగా ఒక సందర్భంలోను సంబంధం లేనట్టుగా ఒక సందర్భంలోను గుర్తించబడుతుంది. ఈ లక్షణాలు లైంగికత్వ నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి.




సభ్యుల ప్రతిస్పందన ద్వారా స్త్రీల లక్షణాలు / స్త్రీత్వం, పురుష లక్షణాలు / పురుషత్వం గుర్తించడం. ఒక లక్షణాన్ని కార్డుపైన వ్రాసి అది సమాజపరంగా ఏ కోవకు చెందిందో తెలిపే అంశాన్ని చార్టుపైన వ్రాసి ఆ కార్డును దాని క్రింద అంటించడం.

ఫెసిలిటేటర్ స్త్రీత్వం / పురుషత్వానికి సంబంధించి కార్డులపై ఏయే లక్షణాలు వ్రాయాలో ఉదాహరణలుగా క్రింది వాటిని చెప్పవచ్చు.


కార్డులపై వ్రాయవలసిన లక్షణాలు: చొచ్చుకుపోయే స్వభావం, భయం లేకపోవడం, బలం కలిగి వుండడం, స్వతంత్రంగా వ్యవహరించడం, ధైర్యం, దురుసైన ప్రవర్తన, కుటుంబపోషణ, సమానంగా, ప్రియంగా వ్యవహరించడం, భయంతో వ్యవహరించడం, కుచించుకుపోవడం, బలహీనంగా వుండడం, ఆధారపడి వుండటం, తెలియనితనం, అమాయకత్వం, ఇంటి పనులు చేయడం, సున్నితంగా వుండటం,

ఫెసిలిటేటర్ రెండు లక్షణాలను విడివిడిగా ఒక టేబుల్ రూపంలో బోర్డుపైన కాని, చార్టుపైన కాని వ్రాసి చివరగా క్రోడీకరించాలి.

ముగింపు: ప్రకృతిపరంగా మనుషులకు స్త్రీ, పురుష భేదం లేకుండా అన్ని లక్షణాలు సహజంగా అబ్బుతాయి. ఇద్దరికీ రెండు విధాలైన లక్షణాలు ఉంటాయి. అయితే సమాజం కొన్ని లక్షణాలను పురుషత్వానికి గుర్తుగాను, కొన్నింటిని స్త్రీలకు ఉండవలసిన లక్షణాలు గాను పరిగణించి వాటిని ఆయా లైంగికత్వ అంశాలుగా బలవంతంగా రుద్దడం

జరుగుతున్నది. పురుషత్వానికి ఆపాదించిన లక్షణాల వల్ల వారు సహజంగా శక్తి కలిగినవారుగాను; ఆస్తులు, వనరులు అందుబాటులో వుండి వాటి ద్వారా మరో లైంగికత్వ అంశాలపై ఆధిక్యతను పొందుతున్నారు. శక్తి / పవర్ ఆధారంగా సమాజంలో స్త్రీలు, పురుషులు, పేద, ధనిక, యజమాని గుమస్తా లాంటి వారిలో అంతరాలు బలంగా వేళ్ళూనుకుని వున్నాయి. కాబట్టి శక్తికి నిర్వచనాలను తిరగరాసి; నిజాయితీ, న్యాయం, ఇతరులకు సహాయపడడం, కలిసిమెలిసి వుండడం వంటి శక్తి కేంద్రాలు రూపొందేలా కృషి చేయాలి.

నేటి సమాజంలో అక్షరాస్యత మెరుగుపడడం, స్త్రీలలో భావదారిద్ర్యం సమసిపోవడం ఒక మంచి పరిణామం. దీనివల్ల కొన్ని లక్షణాలను ఒక లైంగికత్వానికి మాత్రమే పరిమితంచేసి, ఆ లైంగికత్వానికి అవసరమైన శక్తిని మాత్రమే పొందడం కాకుండా రెండు లైంగికత్వాల శక్తులను పొందడం అన్నివిధాలా సాధ్యమవుతుంది. అధికారాలు వేర్వేరు స్థాయిలలో ఎలా వుంటాయో, వివిధ పరిస్థితులలో అధికారం పర్యవసానం, ప్రభావం ఏవిధంగా వుంటుందో ఫెసిలిటేటర్ ఈ క్రింది రకాలుగా వివరించాలి.




**ఆధిపత్యం:** ఇందులో సామాజికమైన / రాజకీయపరమైన; ఆధిపత్యానికి / అణచివేతకు సంబంధించిన హింస, బెదిరింపులు వుంటాయి. హింస కృత్రిమంగా, భావోద్వేగాలకు కనిపించనిదిగా కూడా వుండవచ్చు. ఈరకమైన అధికారాన్ని నిర్వహించడానికి నిరంతరమైన నిఘా అవసరం. దాని స్వభావం కారణంగా క్రియాశీల, నిష్క్రియాత్మక ప్రతిఘటనలను స్వీకరిస్తుంది. ఉదాహరణకు భోజనం చేయకుండా ప్రతిఘటించడం, అవిధేయత, పని చేయకుండా వుండటం వంటివి. ఆచరణలో ఈ వివాదం బలవంతులు, బలహీనుల మధ్య ప్రత్యక్ష పోరును సూచిస్తుంది.


**అధికారం కోసం:** ఇది నిర్ణయాలు చేయగలిగే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే శక్తి, సృజనాత్మకత అనుకూల పరిస్థితులకు సంబంధించినది. ఇది సాధారణంగా వ్యక్తిగత సమర్థతపైన ఆధారపడి వుంటుంది. ఆచరణలో సామర్థ్యాలను పెంచుకోగలగడం, వ్యక్తిగత నిర్ణయాలు చేయగలగడం, నాయకత్వంతో కూడి వుంటుంది.

**అధికారం కలిగి వుండటం:** ఇందులో వ్యక్తులు ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి ఒక సాధారణ ప్రయోజనంతో, ఒక అవగాహనతో నిర్వహించడం వుంటుంది. ఆచరణలో ఇది సామాజిక సమీకరణాలు, అనుసంధానం, సత్సంబంధాలు, నెట్‌వర్కింగ్ పై ఆధారపడి వుంటుంది.

అధికారం కలిగి వుండటం అనేది ఆత్మవిశ్వాసంతో కూడుకున్నది. స్వీయ అవగాహన, సూటిగా చెప్పే తత్వాన్ని కలిగి వుంటుంది. వ్యక్తులు వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి, తెలుసుకుని; సొంత జ్ఞానం, స్వీయ విశ్లేషణ ద్వారా అనుభవాలు పొందగలుగుతారు. సాధారణంగా ఆచరణలో, ఆత్మగౌరవం, అవగాహనను పెంపొందించుకునే తత్వం, ఇంద్రియ జ్ఞానం, విశ్వాసం, సాధికాతరకోసం ఎవరైనా సరే అన్ని వ్యూహాలను లేదా కొన్నింటినైనా ప్రయోగించి ఒక క్రొత్త వాతావరణాన్ని సృష్టించవచ్చు. అధికారం అనేది పూర్తిగా ప్రతికూలం కాదు. అధికారాలను క్రొత్తగా నిర్వచించడం, పున:పంపిణీ చేయడం అవసరం. మన దైనందిన జీవితంలో అధికారం అనేది లేని సంబంధ బాంధవ్యాలు లేవు. అధికారాన్ని అణచివేయడం, తిరస్కరించడం వలన ఎటువంటి ఉపయోగం లేదు. అయితే, ఈ అధికారాలను లైంగికత్వ సానుకూల రీతిలో పున:పంపిణీ చేయాలి. ఆధిపత్యంతో కూడిన అధికారాలను, సంబంధాలను తగ్గించుకునేందుకు మనమందరం ప్రయత్నించాలి అని వివరిస్తూ ఫెసిలిటేటర్ ఈ విషయాంశాన్ని ముగించాలి.

## 3.4 బాలురకు, బాలికలకు సామాజిక కట్టుబాట్లు

పిల్లలు లైంగికత్వ ఆధారంగా తల్లిదండ్రుల నుండి, సమాజం నుండి 8వ ఏట నుంచే లింగ బేధాలకు సంబంధించిన అంశాలను నేర్చుకుంటారు. అబ్బాయిలు తాము బలవంతులుగాను, నైపుణ్యాలు కలిగినవారుగాను; అమ్మాయిలు సున్నితంగా, అణిగి మణిగి వుండే విధంగా తమను తాము భావించుకుంటారు. సమాజ ధోరణిని లింగ భేదాలు, స్త్రీ పురుషుల ప్రవర్తన ప్రతిబింబిస్తాయి. లైంగికత్వ ఆధారంగా బాలబాలికల ఆటలు, కార్యక్రమాలు నిర్దేశించబడతాయి.




ఫెసిలిటేటర్ సభ్యులను రెండు గ్రూపులుగా విభజించి సమాజంలో ఇప్పటికే బాలబాలికలకు వున్న కట్టుబాట్లు చర్చించి పెద్ద గ్రూపులో అందరికీ వివరించమని చెప్పాలి. చిన్న గ్రూపుల ద్వారా చర్చించిన అంశాలలో ముఖ్యమైనవాటిని, అవసరం అనుకున్న అంశాలను మరొకసారి సభ్యులందరికీ అర్థం అయ్యే విధంగా విశదీకరించాలి. ఈవిధమైన కట్టుబాట్లు కుటుంబ, సమాజ అభివృద్ధి తీరును సవాలు చేసే విధంగా, మార్పు చేసే విధంగా వుండాలని ఫెసిలిటేటర్ వివరించాలి. ఈ క్రింద ఉదహరించిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

అమ్మాయిలను కుటుంబానికి భారంగా భావిస్తారు. తల్లిదండ్రులు బాలికల విద్యకు చాలా తక్కువ ప్రాముఖ్యతను ఇస్తారు. సమాజం అమ్మాయిలకు ఒకేరకమైన విధులను కేటాయిస్తుంది. అవి అమ్మాయిలు ఇంటిపట్టున వుండి ఇంటిని, కుటుంబాన్ని చూసుకోవాలి. బాలికలు కుటుంబంలో పోషకాహార వివక్షను ఎదుర్కొంటున్నారు. తరచుగా కావలసిన దానికంటే కూడా తక్కువ ఆహారాన్ని పొందుతారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో అమ్మాయిలు

త్రాగునీరు సేకరించడంలోనే చాలా ఎక్కువ సమయాన్ని ఖర్చు చేస్తారు. తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్ళినపుడు అమ్మాయిలు చెల్లెళ్ళని, తమ్ముళ్ళని చూసుకోవలసి వుంటుంది. సంప్రదాయ పద్ధతుల వలన కూడా అమ్మాయిలు పాఠశాలకు అసలు వెళ్ళకపోవడం కాని లేదా ప్రారంభ దశలోనే స్కూలు మానివేయడం జరుగుతుంది. అందువలన వారు తరచుగా మానసిక ఆందోళనలకు గురి అవుతూ వుంటారు. కలుషిత, అనారోగ్యకర వాతావరణం, వ్యాధినిరోధక శక్తి తక్కువగా వుండటం, పోషకాహార లోపం, విద్యకు నోచుకోకపోవడం అనేవి ముఖ్యంగా అమ్మాయిలను, ముఖ్యంగా గ్రామీణ బాలికలను ఎంతో ప్రభావితం చేస్తాయి. వారి మానసిక, శారీరక, మేధాపరమైన అభివృద్ధి చాలా చిన్న వయస్సునుండే క్షీణింప చేయబడుతుంది. వారి ఆరోగ్యాన్ని అత్యంత నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది.

అబ్బాయి పుట్టినట్లయితే బంధువుల నుండి, స్నేహితుల నుండి చాలా అభినందనలను పొందుతారు. కొడుకు అంటే ఒక ధీమాగా, కొడుకును ఒక పెన్నిధిగా భావిస్తారు. కొడుకు తండ్రి ఆస్తికి వారసుడు. ఆస్తిపై అధికారంతోపాటు తలిదండ్రుల అంత్యక్రియలుచేసే అర్హత కూడా కొడుకుకే దక్కుతుంది. ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని పోషిస్తాడని నమ్మకం. కొడుకుకు కుటుంబం నుండి అతని జీవితాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తగినంత మద్దతు, సహకారం లభిస్తుంది.

అదే అమ్మాయి పుట్టిందంటే మనం చాలా భిన్నంగా ప్రవర్తించడం జరుగుతుంది. అమ్మాయి పుట్టిందంటే చాలామంది తల్లులు ఏడుస్తారు. ఎందుకంటే అమ్మాయి అంటే ఖర్చు అని భావించడం వలన. అమ్మాయి స్థానం ఇంటికే పరిమితం. వారికి ఈ పురుష ప్రపంచంలో స్థానం లేదు. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో అమ్మాయి పుట్టిందంటే ఇంటికి పనిమనిషి పుట్టిందనుకోవడం జరుగుతుంది.

తల్లిదండ్రులు అమ్మాయిలు సమాజంలో స్వేచ్ఛగా వుండటాన్ని ఎక్కువగా ప్రోత్సహించరు. అబ్బాయిలతో పోల్చి చూసినపుడు సమాజంలో జరిగే అకృత్యాల నుండి అమ్మాయిలను దూరంగా వుంచుతూ, ఇంటి పనులకే వారిని పరిమితం చేయాలనుకుంటారు. సమాజంలో వున్న అభద్రత, దురాగతాల వలన తల్లిదండ్రులు అమ్మాయిలను వారిని విద్యకు, బయటకెళ్ళే ఏ ఇతర పనులకు పంపడానికి సుముఖత చూపడం లేదు. వారు ఇంట్లోనే పని చేస్తారు. తోబుట్టువులను చూసుకోవడం, తల్లికి ఎంతో కొంత సంపాదించే అంశంపై మద్దతు అందించడం జరుగుతుంది. 90% మహిళలు తమకున్న పని భారం తగ్గించుకుని ఎంతో కొంత సంపాదించడంలో ఆడపిల్లల సహాయం తీసుకుంటారు. అమ్మాయిలు ఇంటి పని చాకచక్యంగా, నేర్పుగా చేయడం అనేది వారి అత్తవారింటిలో బాగా అవసరమయ్యే నైపుణ్యంగా పరిగణించడం జరుగుతుంది. బాలురకు చిన్నప్పటినుంచీ కూడా మగాడుగా వుండవలసిన లక్షణాలను, ప్రవర్తనలను సమాజం ప్రోత్సహిస్తుంది. అందువలన అనేక విధాలైన అకృత్యాలు ఆడవారిపై జరగడానికి కారణమవుతుంది.



బాలురు పోలిసులు
బాలురు రిపేరు చేస్తారు
బాలికలకు రిపేరు చేసిపెట్టాలి

ఫెసిలిటేటర్ బాలబాలికలపై సమాజం విధించిన కట్టుబాట్లు ఏవిధంగా ప్రభావం చూపుతాయో, వాటివలన ఏరకమైన నష్టాలు జరుగుతాయో విశదీకరిస్తూ, బాధ్యత గల పౌరులుగా ఈ అసమానతలను, కట్టుబాట్లను తొలగించడానికి అభివృద్ధి పథంలో భాగస్తులైన మనం ఎంతో కృషి చేయాలని వివరిస్తూ ఈ విషయాన్ని ముగించాలి.

## 3.5 వనరుల అందుబాటు, వనరులపై అధికారం

ఫెసిలిటేటర్ సభ్యులకు వనరుల అందుబాటు, వాటిపై అధికారాలు ఏవిధంగా వుంటాయి అనే అంశంపై క్రింద ఇచ్చిన వివరణ ద్వారా బోధపరచాలి.

ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు సంబంధించి వనరుల వినియోగం, నియంత్రణ, అజమాయిషీలో మహిళలకు పురుషులతో సమాన స్థాయి వుండదు. ఈ అంశాలలో సమానత్వం సాధికారతకు, దేశాభివృద్ధికి ఎంతో కీలకమైనది. ఈక్రింద ఉదహరించిన కొన్ని వనరులు మహిళలకు చాలా తక్కువగా లభ్యంకావడం లేదా అసలు అందుబాటులో లేని పరిస్థితి వుంది.

- ఉద్యోగాల కల్పన, గౌరవప్రదమైన పని
- భూమి, గృహ, ఇతర ఉత్పాదక వనరులను పొందగలగడం
- ఆర్థిక వనరులను పొందగలగడం
- సామాజిక సంరక్షణను కలిగి వుండటం
- సాంకేతిక సమాచారాన్ని పొందడం
- విద్య, ఆరోగ్యం పొందడం

భూమిని పొందడంలో జెండర్ అసమానత అత్యంత స్పష్టంగా వుంది. చాలా దేశాలలో మహిళలు భూమిని కలిగి వుండటం అనేది ఆచారపరంగా నిషేధించబడినది. పురుషులచే మధ్యవర్తిత్వం చేసిన హక్కులను మాత్రమే మహిళలు వినియోగించుకునే పరిస్థితులలో వున్నారు. అవి భద్రత లేనివిగా వున్నాయి. భూమి లేని గ్రామీణ మహిళలు తరచుగా వంట చెరకు, పశుగ్రాసం, ఆహారం కోసం ఉమ్మడి ఆస్తి, వనరులపై ఆధారపడవలసి వుంటుంది. చాలా

దేశాలలో ఆ వనరులను మితిమీరి ఉపయోగించడం వలన గ్రామీణ జీవనోపాధికి, ఆహారభద్రతకు తీవ్రమైన ముప్పు పొంచి వుంది.

మహిళలు వారి కుటుంబ, వ్యవసాయ సంబంధిత అవసరాల కోసం సహజవనరులపై ఆధారపడతారు. సాధారణంగా జీవనాధార పంటలను పెంచడం అనేది వారి బాధ్యత. వారికి తరచుగా స్థానిక పంటలపైన ప్రత్యేకమైన అవగాహన వుంటుంది. కుటుంబ అవసరాలను తీర్చడం కోసం, గ్రామీణ మహిళలు, బాలికలు నీటి కోసం, ఆహారం కోసం, వంట చెరుకు కోసం చాలా దూరం నడవవలసి వుంటుంది. తాము ఎక్కువగా ఆధారపడిన ప్రకృతి వనరులపై పురుషులతో పోల్చి చూసినపుడు వారికి చాలా తక్కువ నియంత్రణ వుంటుంది. సాధారణంగా పురుషులే భూమిసాగు, పంట, పశువుల పోషణ చేస్తారు. ఇవి వాణిజ్యపరమైనవి. మహిళలు ఇంటి అవసరాల కోసం చేసే పనులకంటే పురుషులుచేసే ఈ వాణిజ్యపరమైన పనులకు ఎక్కువ విలువ ఇస్తున్నారు.

మెరుగైన నీటి నిర్వహణ, ముఖ్యంగా నీటి పారుదల, అధిక వ్యవసాయ ఉత్పాదకతకు, వనరుల పరిరక్షణకు కీలకం. మహిళలకు నీటి పారుదలకు సంబంధించి చాలా తక్కువ వనరులు అందుబాటులో వుంటాయి కాబట్టి ఒకవేళ వారు ఏదైనా నిర్ణయం చేయాలన్నా, భాగస్వాములు కావాలన్నా ఆ కార్యక్రమం భూమి కలిగి వుండటంపై ఆధారపడి వుంటుంది. మహిళలకు తక్కువ నీటిని వినియోగించుకునే అవకాశం వుండటం వలన ఇతర జీవనాధార వ్యవసాయ సంబంధిత వనరులపై ఆధారపడటం భూమి సాగులో అస్థిరత్వానికి దారి తీస్తుంది.

కొన్ని తరాలపాటు మహిళలు చిన్న తరహా రైతులు. వీరు వివిధ రకాల పంటలు పండించారు, వివిధ జంతుజాతులను విస్తృతంగా అభివృద్ధి చేశారు. వ్యవసాయం వ్యాపారీకరణకు, అధిక దిగుబడినిచ్చే పంటలు, జంతువులకు ప్రపంచ వాణిజ్యం ప్రాధాన్యం ఇస్తుండడంతో వ్యవసాయ వైవిధ్యం, జీవ వైవిధ్యం వేగంగా క్షీణించిపోయాయి. దీనివలన స్థానిక ఉత్పత్తులే కాకుండా ప్రపంచ ఆహారభద్రత అనేది ప్రశ్నార్థకమైనది. వ్యవసాయంలో మహిళల పాత్ర ఎక్కువగా వున్నప్పటికీ, వ్యాపారీకరణ వల్ల మహిళల ప్రాధాన్యం తగ్గిపోయింది. ఇదే విధంగా భూమి, ఆర్థికం, సాంకేతిక, సమాచార తదితర వివిధ రంగాలలో అవకాశాలు స్త్రీలకు అందుబాటులో లేకుండా పోయాయి, లేదా చాలా తక్కువగా అందుబాటులో వున్నాయి.

ఫెసిలిటేటర్ పైన వివరించిన అంశాలను క్లుప్తంగా క్రోడీకరిస్తూ మహిళలకు సమానమైన వనరుల సేకరణ, వాటిపై నియంత్రణ లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఏవిధమైన ప్రభావం చూపుతుందో చెప్తూ, మనంచేసే కార్యక్రమాలలో ఈ వనరులు, వనరుల వినియోగానికి అవసరమైన నైపుణ్యాలను మహిళలకు అందుబాటులోకి వచ్చే విధంగా కృషిచేయాలి అని చెబుతూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

# అధ్యాయం 4 : మహిళల సామాజిక స్థాయి; హక్కులు,చట్టాలు

**ఉద్దేశం:** సభ్యులు ప్రస్తుత మహిళల స్థితిగతులను తెలుసుకోవడం. స్త్రీలపై జరిగే హింసలు, ఎన్ని రకాలుగా ఎంతమంది వలన హింసకు గురి అవుతున్నారో తెలుసుకుని, సంబంధిత చట్టాలపైన, అభివృద్ధి విధానాలపైన అవగాహన పెంపొందించుకోవడం.

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 4.1 | సమాజంలో స్త్రీల స్థాయి | మేధోమధనం | 30 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 4.2 | స్త్రీలపై హింస | రోల్ ప్లే | 30 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 4.3 | స్త్రీల హక్కులు, చట్టాలు | ఉపన్యాసం | 60 ని॥లు | చార్టులు, మార్కరు |
| 4.4. | అభివృద్ధి విధానాలు | భాగస్వామ్య చర్చ | 30 ని॥లు | చార్టులు, మార్కర్లు |



## 4.1 సమాజంలో స్త్రీల స్థాయి

ఫెసిలిటేటర్ సభ్యులను ప్రస్తుతం మహిళల స్థితి ఏవిధంగా వుంది అని ప్రశ్నించాలి. తరువాత అన్ని రంగాలలో అనగా, విద్య ఉద్యోగ అవకాశాలు; వ్యవసాయరంగం; వైద్య సౌకర్యం; ఇంటిలో, సమాజంలో మహిళలు ఎలా వున్నారు; ఎంతమంది మహిళలు నిర్ణయాధికారం కలిగి వున్నారు; ఎంతమంది మహిళలు నాయకులుగా ముందుకు రాగలుగుతున్నారు; రాజకీయాలలో ఎంతమంది పాల్గొంటున్నారు అని సభ్యులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టాలి. సభ్యులు చెప్పిన సమాధానాలను ఒక చార్టుపైన కాని, బోర్డు పైన కాని వ్రాయాలి.తరువాత క్రింది వివరణ ఇవ్వాలి.

సూచన : ఫెసిలిటేటర్ ఈ సెషన్ చేసేటపుడు అప్పటి గణాంకాలను ముందుగానే తీసుకుని ఉదహరించాలి. ఉదా; జనాభాలో,అక్షరాస్యతలో, వృత్తిఉద్యోగాలలో, చదువుమానివేసే వారిలో, కార్మిక సంఘాలలో స్త్రీ, పురుష నిష్పత్తి . ఇంకా వేతనాలలో అసమానతలు, ప్రసూతి,శిశు మరణాలు,మహిళలపై హింస, అత్యాచారాలు, ఆస్తిలో వాటా, నిర్ణయాధికారం మొదలైనవి. సమాజంలో మహిళల స్థితిని గురించి మొత్తంగా చర్చించిన తరువాత గ్రామీణ మహిళల స్థితి గురించి మరింతగా చర్చజరిగేలా చూడాలి.

**గ్రామీణ మహిళల స్థితి**

ఫెసిలిటేటర్ సభ్యులనుంచి గ్రామీణ ప్రాంతాలలో మహిళల స్థితిగతులు ఏవిధంగా వుంటాయో భాగస్వామ్య చర్చ ద్వారా విషయాంశాలను రాబట్టాలి. వచ్చిన అంశాలను బోర్డుపైన కాని చార్టుపైన కాని వ్రాసి చర్చ చేయాలి. కొన్ని అంశాలు ఈ క్రింద ఉదహరించడం జరిగింది.

- గ్రామీణ మహిళలకు తమకు సంబంధించిన ఎటువంటి హక్కుల గురించి అవగాహన వుండకపోవడం.
- గ్రామానికి సంబంధించిన ఎటువంటి విషయాలలోను మహిళల భాగస్వామ్యం లేకపోవడం.
- పురుషులతో పోల్చినపుడు స్త్రీలకు ఇచ్చే వేతనం కేవలం 50-60 శాతం మాత్రమే వుండడం
- పిల్లల్ని కనడంపై ఎటువంటి నిర్ణయాధికారం లేకపోవడం
- మగవారు తాము సంపాదించినదంతా వ్యసనాలకు ఖర్చు చేస్తూ, చాలా తక్కువ డబ్బు మాత్రమే ఇంటి ఖర్చులకు ఇవ్వడంవల్ల స్త్రీలపై కుటుంబ నిర్వహణ భారం మరింత ఎక్కువకావడం
- గ్రామీణ మహిళలు సొంతంగా ఒక చిన్న వ్యాపారం మొదలు పెట్టడానికి కూడా సుముఖత చూపరు. డబ్బు లేకపోవడం, కుటుంబం నుండి కావలసినంత మద్దతు లభించకపోవడం, తన శక్తి సామర్థ్యాల మీద తనకు నమ్మకం లేకపోవడం, నష్టం వస్తుందని భయం మొదలైనవి ఇందుకు కారణాలు

ఫెసిలిటేటర్ చాలా విషయాలను సభ్యుల నుండి రాబట్టి చాలా వివరణాత్మకమైన చర్చ చేయడం ద్వారా సభ్యులందరూ గ్రామీణ స్థాయిలో వుండే మహిళల స్థితిగతుల గురించి అవగాహన పెంపొందించుకోగలుగుతారు.

మహిళలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలు. ఎందుకంటే వ్యవసాయం, అటవీరక్షణ, పశువుల పాలన, పాడి పరిశ్రమ మొదలైన గ్రామీణ జీవనంలోని ముఖ్యమైన కార్యకలాపాలన్నీ మహిళలే నిర్వహిస్తారు.

పట్టణ స్థాయి మహిళలకు, గ్రామీణస్థాయి మహిళలకు మధ్య వున్న అవగాహనస్థాయి, అవకాశాల అందుబాటు, అభివృద్ధి మొదలైన విషయాలలో ఎవరు ఏవిధంగా వున్నారు అనే అంశాలను సభ్యులతో చర్చించి, తేడాలను గుర్తించే విధంగా ఫెసిలిటేట్ చేయాలి. ఎక్కువ శాతం గ్రామీణ మహిళలే వుంటారు కాబట్టి అవగాహన, అభివృద్ధి చెందాలనే తపన వారిలో మొదలవ్వాలని వివరిస్తూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

## 4.2 స్త్రీలపై హింస

కుటుంబ పరంగా, సామాజికంగా,ఆర్థికంగా, రాజకీయంగా, ఇతర అనేక విధాలుగా వెనుకబడి వుండడం, కుటుంబ నిర్వహణలో ఎక్కువ భారాన్ని భరించవలసి రావడంతో పాటు మహిళలు ఇంటా బయటా ఎన్నో రకాలుగా శారీరక, మానసిక హింసలకు గురవుతుంటారు.ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని, మహిళలపై హింస ఎన్ని రకాలుగా జరుగుతుందో సభ్యులను రోల్ ప్లే చేసి చూపించమని అడగాలి.

ఫెసిలిటేటర్ సభ్యులకు కొన్ని ఉదాహరణలు ఇవ్వాలి.

- కుటుంబంలో హింస
- పని చేసే ప్రదేశాలలో (కార్యాలయం, పొలం, దుకాణాలు మొదలగునవి) హింస

రోల్ ప్లే అయిన తరువాత గమనించిన అంశాలను మిగతా సభ్యులందరితో చర్చించాలి. చర్చలోని అంశాలను క్రింది విషయాలతో వివరించాలి.

**హింస రకాలు**

1. శారీరక హింస (కొట్టడం, తన్నడం,కాల్చడం, అధిక పనిభారం మొదలైనవి)
2. మానసిక హింస (అవమానించడం, నిందించడం, చిన్నచూపు చూడడం మొదలైనవి)
3. లైంగిక హింస (అన్నిరకాలుగా వివక్ష)
4. ఆర్థిక హింస (చేసే పనిని గుర్తించకపోవడం, విలువ కట్టకపోవడం, తక్కువ వేతనం, ఆస్తిమీద, తన ఆదాయం మీద తనకు హక్కులేకపోవడం మొదలైనవి)

వయస్సు, కులం, మతం, వర్గం, ప్రాంతం, భాష, చదువు, సంస్కృతులు ఏమైనప్పటికి స్త్రీలు నిత్యం ఏదో ఒక హింసకు గురి అవుతున్నారు. ఆడవారిపై అత్యాచారాలు, అకృత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కట్నం కోసం, పురుషుల వ్యసనాల కారణంగా స్త్రీలు పలు రకాలుగా బాధలకు గురిఅవుతున్నారు.

స్త్రీల మీద జరిగే హింసను ఆదేదో సహజమైన విషయమని, వారి ఇంటికే సంబంధించిన విషయమని భావించకుండా, మానవులకు సంబంధించిన అన్ని హక్కులు స్త్రీలకు వున్నాయని సమాజానికి నొక్కి చెప్పాల్సిన అవసరం వుంది. ఈ ఆశయ సాధనలో భాగంగా సమాజంలో పలు రకాల హింసలకు గురవుతున్న స్త్రీలకు చేయూతనిచ్చి, ఆ హింస నుండి రక్షణ పొందడానికి చట్టపరంగా స్త్రీలకు గల హక్కుల పట్ల ఒక అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతో వుంది అని సభ్యులకు తెలియచేసి తరువాత సెషన్‌లో చట్టాల గురించి తెలుసుకుంటామని చెప్తూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

## 4.3 స్త్రీల హక్కులు, చట్టాలు

**భారతదేశంలో మహిళల కోసం రాజ్యాంగపరమైన, చట్టపరమైన నిబంధనలు**

లైంగిక సమానత్వం అనే సిద్ధాంతం భారత రాజ్యాంగంలో అన్ని సందర్భాలలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. రాజ్యాంగం మహిళలకు సమానత్వాన్ని సమకూర్చడమే కాకుండా మహిళలకు అనుకూలమైన సానుకూల దృక్పధాన్ని ఏర్పరిచే దిశగా ప్రోత్సహిస్తుంది. మహిళల సమాన హక్కుల గురించి వివిధ అంతర్జాతీయ సమావేశాలు, వేదికలు చేసిన తీర్మానాలలో భారతదేశంకూడా భాగస్వామి. వాటిలో ముఖ్యమైనది 1993 లో మహిళలపై అనేక రూపాలలో వున్న వివక్షకు వ్యతిరేకంగా చేసిన అంతర్జాతీయ తీర్మానం(సిడా).

**1. రాజ్యాంగ నిబంధనలు**

భారత రాజ్యాంగం కేవలం మహిళల సమానత్వాన్ని గురించి పేర్కొనడమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా, రాజకీయంగా, ఇతర వివిధ రకాలుగా సమానత్వాన్ని సమకూర్చే విధంగా భేదభావాలు లేని విధివిధానాలను పొందుపరిచే విధంగా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నది. ఆర్టికల్స్;14, 15, 15(3), 16, 39(ఎ), 39(బి), 39(సి), 42 మొదలైనవి.

రాజ్యాంగంలో ప్రత్యేక ప్రతిపత్తి:

1. చట్టం ముందు అందరూ సమానమే (ఆర్టికల్ 14)
2. పౌరులెవరినీ కుల, మత, జాతి, లింగం, పుట్టిన ప్రదేశం ఆధారంగా ప్రభుత్వాలు వివక్షకు గురి చేయకూడదు. (ఆర్టికల్ 15(1))
3. ప్రభుత్వాలు మహిళలకు చిన్నపిల్లల కోసం ప్రత్యేకమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలి (ఆర్టికల్ 15(3)
4. ఉద్యోగ నియామకాలలో సమాన అవకాశం (ఆర్టికల్ 16)
5. స్త్రీ పురుష వివక్ష లేకుండా సరైన, సుస్థిరమైన జీవనోపాధి కల్పించడం (ఆర్టికల్ 39(ఎ); సమాన పనికి సమాన వేతనం (ఆర్టికల్ 39(డి))
6. ఉచిత న్యాయ సహాయం (ఆర్టికల్ (39-ఏ)
7. పని ప్రదేశాలలో భద్రత; ప్రసూతి సహాయం (ఆర్టికల్ 42)
8. ప్రత్యేక శ్రద్ధతో బడుగు బలహీనవర్గాల ప్రజలను సాంఘిక అన్యాయం నుండి రక్షించడం; విద్య, ఆర్థిక ఆసక్తి కలిగినవారికి తగిన ప్రోత్సాహం అందించి దోపిడీ నుండి రక్షించడం (ఆర్టికల్ 46)
9. ప్రజలందరికి పౌష్టికాహారం, జీవన ప్రమాణాలను పెంచడానికి కృషి (ఆర్టికల్ 147)
10. మహిళల గౌరవానికి భంగం కలిగే కార్యక్రమాలను, పద్ధతులను తొలగించడం(ఆర్టికల్ 51(ఎ)(ఇ))
11. పంచాయతీలలో (ఆర్టికల్ 243 డి (3, 4)), మునిసిపాలిటీలలో (ఆర్టికల్ 243 టి (3)) మహిళలకు మూడోవంతు సీట్లు రిజర్వేషన్

**2. చట్టపరమైన నిబంధనలు**

రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, ప్రత్యేక ప్రతిపత్తులు వారికి సక్రమంగా అందించడానికి వీలుగా ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన చట్టాలు:

**భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి)**

- ఎ. అత్యాచారం (సెక్షన్ 376 ఐపిసి)
- బి. కిడ్నాపులు, అపహరణ (సెక్షన్ 363,373)
- సి. వరకట్న మరణాలు, హత్యా ప్రయత్నం (సెక్షన్ 302 / 304-బి ఐపిసి)
- డి. మానసిక హింస , భౌతిక హింస (సెక్షన్ 498 ఐపిసి)
- ఇ. ఆత్మ గౌరవానికి భంగంకలిగించడం (సెక్షన్ 354 ఐపిసి)
- ఎఫ్. లైంగిక వేధింపులు (సెక్షన్ 509 ఐపిసి)

**ప్రత్యేక చట్టాలు**

1. ఉద్యోగుల బీమా చట్టం, 1948
2. కార్మికుల చట్టం, 1951
3. కుటుంబ న్యాయస్థానాల చట్టం, 1954
4. ప్రత్యేక వివాహ చట్టం, 1954
5. హిందూ వివాహ చట్టం, 1955
6. వారసత్వ చట్టం, 1956
7. అక్రమ రవాణా నిరోధ చట్టం, 1956
8. ప్రసూతి సౌకర్యాల చట్టం,1961,(సవరణ 1995)
9. వరకట్న నిషేధ చట్టం, 1961 (సవరణ 1986)
10. గర్భ విచ్ఛిత్తి చట్టం, 1971

11. కాంట్రాక్ట్ కార్మికుల చట్టం, 1976
12. సమాన వేతన చట్టం, 1976
13. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, 2006
14. మహిళలను అసభ్యంగా చూపడాన్ని నిషేధించే చట్టం, 1986
15. సతీసహగమన నిషేధ చట్టం, 1987
16. గృహహింస నుండి విముక్తి చట్టం, 2005
17. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం, 2013

**మహిళల కోసం ప్రత్యేక చర్యలు**


- 1971 – దేశంలో మహిళల స్థితిగతులను, వారి అన్ని హక్కులకు సంబంధించిన అంశాలను పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారు
- 1980 – మహిళల సమస్యలు జాతీయ అజెండాలో భాగమైంది
- 1985 – మహిళల కోసం కార్యక్రమాలను, ప్రణాళికలను, మార్గదర్శకాలను సూత్రీకరించడానికి మహిళా శిశు సంక్షేమ శాఖను ఏర్పరిచి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా సమన్వయం చేస్తూ వినూత్న కార్యక్రమాల అమలు ప్రారంభం
- 1992 – మహిళలకు అందించబడిన రాజ్యాంగ, చట్టబద్ధమైన రక్షణలకు సంబంధించిన అన్ని విషయాలను పర్యవేక్షించుటకు చట్టబద్ధమైన సంస్థ ఏర్పాటు
- 1993 – కేంద్రంలో మహిళా,శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు
- 1993 – భారత ప్రభుత్వం సిడా (సిఇడిఎడబ్ల్యు) లో భాగస్వామ్యానికి అంగీకరించడం
- 9వ పంచవర్ష ప్రణాళికలో మహిళల కోసం ప్రత్యేక కేటాయింపులు
- 10వ పంచవర్ష ప్రణాళికలో అన్ని రంగాలలో లైంగిక సమానత్వంపై దృష్టి సారించడం
- బాలికల జాతీయ కార్యాచరణ ప్రణాళిక (1991–2000) – ఈ ప్రణాళిక బాలికల పుట్టుక, బ్రతకడం, రక్షణ మరియు అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరిగింది. బాలికల కోసం మెరుగైన భవిష్యత్తును రూపొందించడమే అంతిమ లక్ష్యం
- మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖలో మహిళా శిశు సంక్షేమశాఖ 'జాతీయ మహిళా అభివృద్ధి పాలసీ'ని 2001 సం॥లో తయారు చేయడం జరిగింది. ఈ విధానం లక్ష్యం మహిళల పురోగతి, అభివృద్ధి, సాధికారతను సాధించడమే
- భారత ప్రభుత్వం 2001 సంవత్సరాన్ని 'మహిళా సాధికారత సంవత్సరం'గా ప్రకటించింది. మహిళలకు మెరుగైన జీవితం; సమానత్వం; సామాజిక, రాజకీయ ఆర్థికపరమైన భరోసా; వనరుల కల్పన ముఖ్య ఉద్దేశాలు
- 73వ, 74వ రాజ్యాంగ సవరణలు – స్థానిక సంస్థలలో మహిళలకు 33% రిజర్వేషన్లు



ఫెసిలిటేటర్ పైన వివరించిన చట్టాలు, హక్కుల గురించి సభ్యులందరితోచర్చించాలి. ఇంకా ఎన్నో రకాల చట్టాలు, హక్కులు వున్నాయని ఇక్కడ కొన్ని మాత్రమే వివరించగలిగామని ఇంకా క్షుణ్ణంగా తెలుసుకోవడానికి కొన్ని సంబంధిత పుస్తకాలు చదవవచ్చని తెలియచేస్తూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

## 4.4 అభివృద్ధి విధానాలు

మహిళాభివృద్ధి, లైంగికాభివృద్ధి అనే పదాలను కొన్నిసార్లు మార్చి మార్చి ఉపయోగిస్తుంటాం. కాని కొన్ని ప్రధానమైన తేడాలు ఈ రెండు అంశాలకు సంబంధించి వున్నాయి. మహిళా అభివృద్ధి విధానాలు 1970వ సం॥లో మహిళల సమీకృతాభివృద్ధి కోసం రూపకల్పన చేయబడినవి. లైంగికాభివృద్ధి అనేది ప్రజల ఆధారిత అభివృద్ధి సాధించడానికి ముందస్తు పరిస్థితులను దృష్టిలో వుంచుకుని తయారు చేయడమైనది. రెండు విధానాలను ఇప్పటికి ఉపయోగించుకుంటున్నారు. ఈ రెండు విధాలుగా కూడా వర్తింపచేసుకోవచ్చు. అయితే లైంగికాభివృద్ధి అనేది స్త్రీ, పురుషులకు ఇద్దరికి సంబంధించినది. కాని చాలా సందర్భాలలో మాత్రం మహిళలపైనే ఎక్కువ దృష్టి సారించడం జరుగుతుంది. ఎందుకంటే స్త్రీలకు, పురుషులకు వున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అవకాశాలు సమాజంలో సమానంగా లేవు. కాబట్టి పురుషుల కంటే కూడా స్త్రీల పైన దృష్టి సారించవలసిన అవసరం వుంది. ఇది ఎలా అంటే రెండు గ్లాసులున్నాయనుకుందాం. అందులో ఒకటి సగం నిండి వుంది. ఒకటి ఖాళీగా వుంది. అప్పుడు ఖాళీ గ్లాసులో ముందుగా కొంత నీరు పోసిన తరువాత, రెండవ గ్లాసుతో సమానం అయ్యాక అప్పుడు మొదటి గ్లాసులో, రెండవ గ్లాసులో రెండింటిలోను నింపాలి. ఎవరైనా గ్లాసులో నీరు ఏ స్థాయిలో వుందో గమనించకుండా నీరు నింపుతున్నట్లయితే వృధా అవడం తప్ప ప్రయోజనం వుండదు.



ఫెసిలిటేటర్ మహిళల పరంగా, లైంగికత్వపరంగా అభివృద్ధి ఎలా జరగాలి అనేది ఉదాహరణతో వివరించాలి. ఈ క్రింది విషయాంశాలతో రెండింటి మధ్య తేడాలను వివరించాలి.

| మహిళ ... అభివృద్ధి (Women and development) | లైంగికత్వం ... అభివృద్ధి (Gender and development) |
|---|---|
| 1. విధానం<br>మహిళల సమస్యలపె స్పందించడం | పౌరుల అభివృద్ధి |
| 2. అభిరుచులపై దృష్టి<br>మహిళలు | మహిళలు / పురుషుల మధ్య సంబంధాలు |
| 3. సమస్యలు<br>అభివృద్ధి ప్రక్రియలో (ఉత్పత్తిలో సగభాగం వనరుల సామర్థ్యం కలిగినవారు) మహిళలకు స్థానం లేకపోవడం | మహిళలు / పురుషుల మధ్య అధికారం చెల్లుబాటు సమానంగా లేకపోవడం |
| 4. ఉద్దేశాలు<br>మరింత సమర్ధమైన అభివృద్ధి | సబబైన, సుస్థిరమైన అభివృద్ధి.<br>స్త్రీ పురుషులు సమాన భాగస్వాములు. |
| 5. పరిష్కారం<br>అభివృద్ధి పథంలో మహిళా భాగస్వామ్యం | పేదల, మహిళల శక్తిసామర్థ్యాలను పెంచడం |
| 6. వ్యూహాలు<br>మహిళా ప్రాజెక్టులు<br>మహిళా విధానాలు<br>సమీకృత కార్యక్రమాలు<br>మహిళల ఆదాయం పెంచడం<br>మహిళల శక్తి సామర్థ్యాలు పెంచడం<br>సంప్రదాయ పనులు చేపట్టడం | స్త్రీ, పురుషుల కనీసావసరాలను పరిగణించి, వారి జీవన పరిస్థితులు మెరుగుపరచడం. మహిళలు, పేదల వ్యూహాత్మక అవసరాలను గుర్తించి, వారి సామాజిక స్థాయిని మెరుగుపరచడం |
| 7. కార్యక్రమాలు<br>మహిళల కోసం చిన్న స్థాయి ఋణ కార్యక్రమాలు<br>జంతు సంరక్షణ<br>మెరుగైన వంటపొయ్యిలు<br>పోషణ గురించి శిక్షణ / విద్య | స్త్రీలు , పురుషుల సాంప్రదాయిక వృత్తులలో పరస్పరం మార్పువచ్చే విధంగా శిక్షణ ఇవ్వడం<br>(ఉదా: సమానంగా సమాచారం; హక్కులు, అధికారాలు సమానంగా పొందగలగడం) |
| 8. మహిళల పాత్ర<br>అభివృద్ధి కార్యక్రమాలలో కొన్నిసార్లు లబ్ధిదారులు కావడం, మరికొన్ని సార్లు పాల్గొనడం | సామాజిక మార్పుకు కార్యకర్తలు |

ఈ రెండింటి మధ్య తేడాలను వివరిస్తూ ఫెసిలిటేటర్ ఎటువంటి అభివృద్ధి అయితే సమ సమాజాభివృద్ధి అవుతుందో, లైంగిక వివక్షలేని అభివృద్ధికి ప్రాధాన్యం వుండేలా ఎలా చూడాలో వివరిస్తూ, సభ్యులందరు వారు చేస్తున్న కార్యక్రమాలు ఏ రకమైన అభివృద్ధిదిశగా వున్నాయో సమీక్షించుకుని, లైంగిక వివక్షలేని అభివృద్ధి దిశగా సాగేలా కృషిచేయాలి అని చెప్పాలి.




స్త్రీల పైన హింస వద్దు

# అధ్యాయం 5 : మహిళా సాధికారత

**ఉద్దేశం:** సభ్యులు ఈ విషయాంశం నుండి సాధికారత అంటే ఏమిటి, సాధికారతకు సూచికలు ఏవిధంగా వుంటాయి అనే అంశాలపైన అవగాహన పెంపొందించుకోవడం

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 5.1 | సాధికారత అంటే | చర్చ | 30 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 5.2 | సాధికారత సూచికలు | చిన్న గ్రూపు చర్చ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 5.3 | వ్యవసాయంలో స్త్రీ, పురుషుల పాత్ర | భాగస్వామ్య చర్చ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 5.4 | మహిళలకు సమాన ప్రాధాన్యంలో సిబిఓల పాత్ర | ఫ్లాష్ కార్డులపై వ్రాయడం (ఒక్కొక్కరుగా) | 60 ని॥లు | ఫ్లాష్‌కార్డ్స్, మార్కర్లు, పెన్నులు |

## 5.1 సాధికారత అంటే

ఫెసిలిటేటర్ సాధికారత అంటే ఏమిటి అని సభ్యులను ప్రశ్నించాలి. సభ్యుల నుండి వచ్చిన సమాధానాలను చార్టుపైన కాని, బోర్డుపైన కాని వ్రాసి ఎటువంటి విషయాలలో అభివృద్ధి జరిగితే మహిళా అభివృద్ధి అంటారో వివరణ ఇవ్వాలి.





వివరణ: అధికారం చెలాయించే తీరులో మార్పునకు దోహదం చేసే విధంగా లైంగిక సంబంధాలు పరిణతిచెందే ప్రక్రియను, మహిళలు తమ జీవితాలపై తమకు అధికారం, అజమాయిషీ కలిగి వుండడాన్ని మహిళా సాధికారత అంటారు. సామాజిక,ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో మరింత నిర్ణయాత్మక పాత్ర, మెరుగైన అవగాహన, మరింత ఆత్మవిశ్వాసం, జీవన విధానాల ఎంపికలో మరింత స్వేచ్ఛ, మరిన్ని వనరుల అందుబాటు, సంస్థాగతమైన అసమానతలను, వివక్షను తొలగించడం,ఉన్న అవకాశాలను తమకు అనుగుణంగా మార్చుకుని ఆశించిన మార్పు సాధించడం ... ఇవన్నీ సాధికారతలో భాగం.

పై విషయాలను వివరంగా సభ్యులకు ఉదాహరణలతో చెప్పాలి.

ఈ క్రింది సూచికలను మహిళా సాధికారతకు ఉదాహరణలుగా వివరించవచ్చు.

## 5.2 సాధికారతకు సూచికలు

ఫెసిలిటేటర్ సభ్యులను చిన్న గ్రూపులుగా విభజించి స్త్రీలకు, పురుషులకు సాధికారత సూచికలను తయారుచేసుకుని రావలసిందిగా చెప్పాలి. మహిళలకు సాధికారత సూచికలు ఏవిధంగా వున్నాయో అలాగే పురుషులకు కూడా వుంటాయని వివరించాలి. చిన్నగ్రూపుల సభ్యులు చెప్పే విషయాలను బోర్డుమీద రాయాలి. తరువాత సాధికారత సూచికల గురించి వారికి మరింత అవగాహన కలిగేలా వివరించాలి.

**మహిళలకు**

- కోరుకున్న విద్య, ఆరోగ్యం పొందగలగడం
- ఆస్తిహక్కు
- నైపుణ్యాల పెంపుదల
- నిర్ణయాలలో భాగస్వామ్యం
- సమస్యలను పరిష్కరించగలగడం
- స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కలిగివుండడం
- ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం
- సామాజిక, ఆర్థిక, రాజకీయ,సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలలో అవగాహన
- చక్కగా మాట్లాడడం, అనుకున్న విషయాన్ని సూటిగా చెప్పగలగడం
- కుటుంబం నుండి మద్దతు పొందగలగడం
- నాయకత్వం వహించగలగడం
- తమ ఆరోగ్యం, పౌష్టికాహారం, చదువు, హక్కులు, సంపాదన, ఖర్చు; పునరుత్పత్తికి సంబంధించి నిర్ణయాలు చేయగలగడం

- అవకాశాల అందుబాటు, వనరులను వినియోగించుకోగలగడం
- ప్రజాస్వామ్య పద్ధతిలో నడిపించడం
- రాజకీయ ప్రక్రియలో పూర్తిగా పాల్గొనగలగడం
- కుటుంబంలో, సమాజంలో తమ ఆత్మగౌరవం, హెూదా పెంచుకోవడం
- సురక్షితమైన పని వాతావరణం అందుబాటు
- పుట్టే హక్కు
- కట్నం ఇవ్వకుండా వుండటం
- సమాన వేతనాలు
- ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరమైన కట్టుబాట్లను తొలగించుకోవడం;వితంతు వివాహాలు, పునర్వివాహాలకు సానుకూలమైన వాతావరణం ఏర్పరచడం
- గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయిలో మహిళా సంఘాలను, వేదికలను ఏర్పరచుకోవడం
- అమ్మాయిలపై, మహిళలపై గృహ హింస, ఇతర హింసల తగ్గుదల
- వ్యక్తిగతంగా, సమూహంలో వ్యవహార శైలి పెంచుకోవడం
- సమావేశాలలో, శిక్షణా కార్యక్రమాలలో మహిళల భాగస్వామ్యంలో కనిపించదగిన మార్పు
- ఇంటి లోపల, బయట మహిళల ఆర్థిక సహకారానికి గుర్తింపు **పురుషులకు**





- మహిళల ఆత్మగౌరవాన్ని గౌరవించడం
- మహిళల పనిని గుర్తించడం
- ఇంటి పనిని తన బాధ్యతగా భావించి, సహకరించడం
- పిల్లల పెంపకంలో తనవంతు భాధ్యతను నిర్వర్తించడం
- మహిళలపై హింసకు పాల్పడకుండా వుండడం, మహిళలపై హింసను ఎదుర్కోవడం
- మహిళలు వారి హక్కులను సాధించుటకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం
- మహిళలకు ఆపాదించిన మూసపోత పాత్రలను తొలగించడానికి ప్రయత్నించడం
- స్త్రీ లక్షణాలుగా భావించే ప్రేమ, సానుభూతి, దయ, కరుణ భావనలను తాను కలిగివుండడం, అలా వుండడాన్ని గర్వంగా భావించడం
- పురుష లక్షణాలుగా భావించే దోపిడీ, దుందుడుకు స్వభావం, కోపం, హింసాత్మక ప్రవర్తనలకు దూరంగా వుండడం, ఈ గుణాలు వున్నవారిని మార్చే ప్రయత్నం చేయడం
- కుమారులను, కుమార్తెలను సమానంగా చూస్తూ, సమాన అవకాశాలను కల్పించడం.
- మహిళలు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని కల్పించి, ఆ నిర్ణయాలను గౌరవిస్తూ మద్దతునివ్వడం
- మహిళలపట్ల వివక్షకు, దోపిడీకి కారణమైన ఆచార వ్యవహారాలను ఖండించడం
- మహిళల హక్కులను మానవహక్కులుగా పోరాడటం
- పనిప్రదేశంలో, సమాజంలో స్త్రీలు సమాన అవకాశాలను, సదుపాయాలను పొందే వాతావరణాన్ని తాను కల్పించడం, అందుకోసం కృషిచేయడం
- స్త్రీల సమస్యలను సామాజిక పరమైన, అభివృద్ధి పరమైన సమస్యలుగా గుర్తించడం, ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేయడం

**పరిమాణాత్మక సూచికలు**

- ప్రజల ధోరణి: మాతృ మరణాల శాతం, సంతానోత్పత్తి శాతం, లింగ నిష్పత్తి, పుట్టిన జీవి బ్రతకడం, పెళ్ళికి సరాసరి వయస్సు వంటివి.
- అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనే స్త్రీ, పురుషుల సంఖ్య
- సామాజిక వనరులను, ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకునే స్త్రీ, పురుషుల సంఖ్య
- ఆరోగ్యం, పోషకాహార పరిస్థితులలో కనిపించదగిన మార్పు, విద్యలో మార్పు
- రాజకీయాలలో భాగస్వామ్యం పొందే స్త్రీ, పురుషుల సంఖ్య

ఫెసిలిటేటర్ ఈ సూచికలను వివరంగా సభ్యులతో చర్చించి సూచికలు ఎలా ఉపయోగించాలో సభ్యుల చేత ఉదాహరణతో చెప్పించడం వలన ఎక్కువ అవగాహన ఏర్పరచుకోగలుగుతారు. అంతేకాకుండా సభ్యులు వారి వారి కార్యక్రమాలను, ప్రాజెక్టును పర్యవేక్షణ లేదా మూల్యాంకనము చేసేటపుడు పైన ఉదహరించిన సూచికలను దృష్టిలో వుంచుకొని పని చేయవలసి వుంటుంది. నివేదికలో కూడా ఆ అంశాలను పొందుపరచడం అవసరం.

## 5.3 వ్యవసాయంలో స్త్రీ, పురుషుల పాత్ర

ఫెసిలిటేటర్ వ్యవసాయంలో స్త్రీ, పురుషుల పాత్ర ఏవిధంగా వుంటుందో సభ్యులందరి చేత చిన్న గ్రూపు చర్చ ద్వారా అవగాహన పెంపొందించాలి. సభ్యులను రెండు గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపును స్త్రీల, పురుషుల పాత్ర గురించి వివరంగా చర్చించి చార్టుపైన వ్రాసి ఒక్కొక్క అంశాన్ని స్త్రీ, పురుషుల పనితో పోల్చుతూ వివరంగా అందరి మధ్య చర్చ జరిగే విధంగా ఫెసిలిటేట్ చేయాలి.

ఈ క్రింది కొన్ని అంశాలు చర్చను మొదలుపెట్టడానికి ఉదాహరణగా ఇవ్వడమైనది.

| అంశము | స్త్రీ | పురుషుడు |
|---|---|---|
| చేసే పని | | |
| పరికరాలు | | |
| పని చేసే శాతం | | |
| పొలం ఎవరి పేరు మీద వుంటుంది | | |
| పంటకు సంబంధించి నిర్ణయాలు | | |
| పంటపై వచ్చిన ఆదాయంపై హక్కు | | |
| ఖర్చులపై నిర్ణయం తీసుకోగలగడం | | |
| మార్కెటింగ్ | | |
| సంబంధిత అధికారులను, ఇతరులను కలవడం | | |
| సాంకేతిక పరిజ్ఞానం | | |
| ఇతరములు | | |

ఫెసిలిటేటర్ వ్యవసాయానికి సంబంధించి స్త్రీ, పురుషుల పాత్ర అనే విషయాన్ని క్షుణ్ణంగా చర్చించిన తరువాత సభ్యులందరికీ ఏవిధమైన అభిప్రాయాలు, ఆలోచనలు కలుగుతున్నవో వివరిస్తూ దానిని సమానత్వ దిశగా తీసుకురావడానికి కృషి చేయవలసి వుంటుందని వివరిస్తూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

## 5.4 మహిళలకు సమాన ప్రాధాన్యంలో సిబిఓల పాత్ర

ఫెసిలిటేటర్ ఈ అంశంపై చర్చించే ముందుగానే సభ్యులందరికీ ఫ్లాష్ కార్డ్స్ పంచాలి. మహిళలకు సమాన స్థాయిపై సిబిఓల పాత్ర ఏవిధంగా వుండాలి, ప్రస్తుతం ఏవిధంగా వుంది అనే అంశంపై కొంత చర్చ చేయాలి.



తరువాత సభ్యులందరిని ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క కార్డుపైన వ్రాయమని చెప్పాలి అందరూ వ్రాసిన తరువాత కార్డులను సేకరించి వచ్చిన అంశాలపై సభ్యులందరితో చర్చ చేయాలి.

కొన్ని అంశాలను ఈ క్రింద ఇవ్వడం జరిగింది.

1. సిబిఓలో స్త్రీ పురుషుల సంఖ్య సమానంగా నైనా వుండాలి లేదా స్త్రీల సంఖ్య అధికంగా వుండాలి
2. నాయకత్వ స్థాయిలో మహిళలు వుండాలి
3. సిబిఓలలో మహిళలు చర్చించుకోవడానికి, నిర్ణయాలు తీసుకోవడానికి, సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రత్యేక ప్రదేశం వుండాలి
4. సిబిఓలలో స్త్రీ, పురుషులకు లైంగికత్వంపై శిక్షణ ఏర్పాటు చేయాలి
5. సమాజంలో లైంగికత్వం తీరుపైన, స్త్రీ పురుషుల పాత్ర , బాధ్యతలపైన సిబిఓ విశ్లేషణ జరిపి వచ్చిన ఫలితాలకు అనుగుణంగా కొన్ని వ్యూహాత్మక , ఆచరణాత్మక కార్యక్రమాలు చేపట్టాలి
6. నెట్‌వర్క్స్ ఏర్పరచుకోవడానికి తగినంత అవకాశాలను సిబిఓ కల్పించాలి
7. సిబిఓలు కొన్ని సూచికలను ఏర్పాటు చేయడం ద్వారా లైంగిక సమానత్వాన్ని సాధించే దిశగా పని చేయాలి
8. లైంగికత్వ సమస్యలను పరిష్కరించే విధంగా, మహిళలకు మద్దతునందించే విధంగా వున్న ఐఇసి మెటీరియల్‌ను తయారుచేయాలి లేదా వాటిని పొందాలి
9. జెండర్ అనేది ప్రతి సమావేశంలోను చర్చించవలసిన ఆందోళనకరమైన సమస్య అని గుర్తించాలి
10. లైంగిక సమానత్వానికి సంబంధించిన ఏదైనా మంచి విషయం వుంటే దానిని ప్రచురించి, పాటించే విధంగా ప్రోత్సహించాలి
11. జెండర్‌పట్ల తగిన రీతిలో స్పందించే సంస్థగా కొన్ని ప్రమాణాలను అభివృద్ధి చేయాలి
12. లైంగిక సమానత్వం కోసం వినూత్న పద్ధతులు, వ్యూహాలు రూపొంచాలి
13. ఇవన్నీ అమలు జరిగేలా చూడడం కోసం ఒక కమిటీని ఏర్పాటుచేయాలి

ఫెసిలిటేటర్ ప్రస్తుతం వున్న సి బి ఓలు స్త్రీల సమానత్వం కోసం ఏరకంగా పని చేస్తున్నాయి, వాటి ద్వారా స్త్రీలలో వచ్చిన మార్పు తద్వారా సమాజంలో వచ్చిన మార్పు గురించి కొంత వివరణ ఇవ్వాలి. సి బి ఓలు లైంగిక సమానత్వం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో సహకారం అందించాయని, కొంత నిర్ణయాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం, కార్యక్రమాలలో భాగస్వామ్యులయ్యే అవకాశాలు వాటి ద్వారానే మహిళలకు కలిగాయని వివరిస్తూ ఈ విషయాంశాన్ని ముగించాలి.

# అధ్యాయం 6 : ప్రధాన జీవన స్రవంతిలో లైంగికత్వం (జెండర్)

**ఉద్దేశం:** సభ్యులు ఈ విషయాంశము ద్వారా జెండరు ప్రాముఖ్యత సమాజాభివృద్ధికి ఎంత అవసరమో అవగాహన పెంపొందించుకోవడం

| సెషన్ | విషయం | పద్ధతి | సమయం | కావలసిన పరికరాలు |
|---|---|---|---|---|
| 6.1 | జెండర్ అంశాలు | చర్చ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 6.2 | జెండర్ ప్రధాన జీవన స్రవంతి: సంస్థ స్థాయిలో | చిన్నగ్రూప్ చర్చ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 6.3 | జెండర్ ప్రధాన జీవనస్రవంతి: కార్యక్రమ స్థాయిలో | చిన్నగ్రూప్ చర్చ | 60 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 6.4 | జెండరు తనిఖీ / ఆడిట్ | చర్చ | 30 ని॥లు | చార్టులు, మార్కర్లు |
| 6.5 | కార్యాచరణ ప్రణాళిక, అనంతర చర్యలు | చర్చ | 30 ని॥లు | |

## 6.1 జెండర్ అంశాలు

**లైంగికత్వాన్ని పట్టించుకోకపోవడం**

లైంగికత్వానికి సంబంధించిన అంశాలను పట్టించుకోకుండా వ్యవహరించే ధోరణి ప్రాజెక్టులు, విధానాల ద్వారా వచ్చే సాంఘిక ఫలితాలపైన తీవ్ర ప్రభావం చూపుతుంది.అందువలన అవి వైఫల్యం చెందుతాయి.

**లైంగికత్వ అవగాహన**

స్త్రీ పురుషుల మధ్య సామాజికపరమైన అసమానతలు వున్నాయని; అవి వారి వనరుల సమీకరణ, నియంత్రణ సామర్థ్యాల పైన ప్రభావం చూపుతాయని గ్రహించడం.

**లైంగికత్వంపై స్పందించడం**

సమాజంలో ఇప్పటికే వున్న లైంగికత్వ తేడాలు, సమస్యలు, అసమానతలను గుర్తించి వ్యూహాత్మకంగా వాటిపై స్పందించడం, చర్యలు చేపట్టడం

**లైంగిక సమానత్వం**

లింగభేద పరంగా స్త్రీపురుషుల మధ్య వున్న అసమానతలు, వివక్ష తొలగిపోయి; అవకాశాల అందుబాటులో, వనరుల కేటాయింపులో లేదా ప్రయోజనాలు పొందడంలో సమానత్వం సాధించడం.

**లైంగిక పరంగా సబబైన రీతి**

స్త్రీ పురుషుల మధ్య సమానత్వంతో పాటు, లైంగికపరమైన అవసరానికి అనుగుణంగా అవకాశాలు, వనరులు, ప్రయోజనాలు మొదలైనవాటి ప్రత్యేక కేటాయింపు

**లైంగికత్వ విశ్లేషణ**

లైంగిక పరమైన సమాచారం పొందడానికి, ఆ సమాచారాన్ని అవసరమైన రీతిలో క్రోడీకరించడానికి అవలంబించే పద్ధతి. ప్రతి అంశంలో స్త్రీ , పురుషుల శాతం లేదా నిష్పత్తిని వర్గీకరించడం.

**లైంగికత్వ ప్రణాళిక**

స్త్రీ పురుషుల విభిన్నమైన అవసరాలను దృష్టిలో వుంచుకుని వారిద్దరి అవసరాలకు అనుగుణంగా వుండే విధానాలు, ప్రాజెక్టుల రూపకల్పనకు చేసే ప్రణాళిక .

**కనీస అవసరాలు**

మహిళను సామాజికంగా అంగీకరించే పాత్రలలో గుర్తించడానికి కొన్ని అవసరాలు వుంటాయి. అవి నీటి సదుపాయం, ఆరోగ్యసంరక్షణ, ఉద్యోగం, ఇల్లు, విద్య, పారిశుద్ధ్యం మొదలైనవి.అయితే, ఇవి మహిళల కనీసావసరాలను తీరుస్తాయే కాని సమాజంలో లైంగికపరమైన అసమానతలను తొలగించడానికి ఉపయోగపడవు.

**వ్యూహాత్మక అవసరాలు**

సమాజంలో మహిళలకున్న అధీన పరిస్థితుల వల్ల ఈ అవసరాలను గుర్తించడం జరిగింది. ఇవి పరిస్థితులకు అనుగుణంగా, నిర్దిష్ట సందర్భాల ప్రకారం మారుతూ వుంటాయి. అవి లైంగికపరమైన శ్రమవిభజన, అధికారం నియంత్రణ , న్యాయపరమైన హక్కులు, గృహహింస ఇతర ఏరకమైన హింస నుండి విముక్తి , సమాన వేతనాలు, మహిళలకు వారి శరీరంపై వారికి హక్కు , ఆస్తిహక్కు, రాజకీయాలలో పాల్గొనగలగడం, మొదలగునవి. ఇవి

దీర్ఘకాలిక అవసరాలు. సమాజంలో లైంగిక అసమానతలు తొలగి లైంగిక సమానత్వం రావాలంటే ఈ దీర్ఘకాలిక అవసరాలను నెరవేర్చడం తప్పనిసరి.

**జెండర్ – ప్రధాన జీవన స్రవంతి**




1995లో బీజింగ్‌లో జరిగిన 4వ ప్రపంచ మహాసభలో లైంగిక సమానత్వ సాధన కోసం జెండరును ప్రధాన జీవన స్రవంతిలో ప్రపంచ వ్యూహంగా గుర్తించడం జరిగింది. జెండరును ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం అంటే మహిళలు , పురుషులు అభివృద్ధి ప్రక్రియలలో సమానమైన ప్రయోజనాలు, వనరులపై సమానమైన నియంత్రణ, సమానమైన నిర్ణయాధికారం, ప్రాజెక్టులు, కార్యక్రమాలు, విధానాలలో అన్ని దశలలో సమభాగం వుండే విధంగా భరోసా ఇవ్వగలిగే ఒక ముఖ్యమైన ప్రక్రియ. లైంగికత్వాన్ని సమానత్వానికి సంబంధించిన అంశంగాను, మానవహక్కులకు సంబంధించిన అంశంగాను గుర్తించాలి. జెండరు ప్రధాన జీవన స్రవంతి అనేది అభివృద్ధి లక్ష్యాలను సమర్ధంగా, స్థిరంగా, ప్రజల భాగస్వామ్యంతో సాధించడానికి అవసరమైన ముఖ్య సాధనం.

## 6.2 జెండర్ ప్రధాన జీవన స్రవంతి: సంస్థ స్థాయిలో

ఫెసిలిటేటర్ జెండర్ అంశాలను గురించి వివరించిన తరువాత ఒక సంస్థ లైంగికత్వానికి అనుగుణంగా వుండాలంటే ఆ సంస్థలో ఏఏ అంశాలు వుండాలో సభ్యులు చిన్న గ్రూపులో చర్చించుకుని వచ్చి వివరించాలని చెప్పాలి. వారు వివరించే విషయాలను బోర్డుపై వ్రాసుకుని, ఈ కింద పేర్కొన్న అంశాల ద్వారా ఈ అంశంపై వారికి మరింత అవగాహన కలిగించాలి.

నియమాలు, పద్ధతులు, ఆచార వ్యవహారాలను మార్చడం ద్వారా సంస్థ స్థాయిలో లైంగిక సమానత్వానికి సంబంధించిన మార్పులను తీసుకురావలసిన అవసరం వుంది. ఇవి లైంగిక సమానత్వాన్ని సాధించడంలో సానుకూలమైనవి. ఉద్యోగినుల సంఖ్య పెంచడం మాత్రమే సరిపోదు. ఈక్రింద ఉదహరించిన అంశాలు ముఖ్యమైన కారకాలుగా సాధించడంలో ఉపయోగపడతాయి.

- సంస్థ ఆశయంలో, కార్యాచరణ విధానంలో లైంగిక సమానత్వం స్పష్టంగా పేర్కొని వుండడం.
- లైంగిక సమానత్వ సాధనకు యాజమాన్యం అంకితభావంతో కృషిచేయడం
- లైంగిక సమానత్వానికి సంబంధించిన దృక్పథాలను, సూచనలను మార్గదర్శకాలలో, శిక్షణా విధానాలలో, నిర్వహణలో పొందుపరచడం
- సిబ్బంది, కన్సల్‌లెంట్స్ ఉద్యోగ విధివిధానాలలో లైంగిక దృక్పథం ప్రతిబింబించడం
- నిర్ణయాధికారంలో స్త్రీ, పురుషులిద్దరూ సమాన సంఖ్యను కలిగి వుండడం (బోర్డు, జనరల్ బాడీ, కార్యనిర్వాహక కమిటీ, అడ్వయిజరీ కమిటీ, ఇతర కమిటీలలో).



- అన్ని కార్యక్రమాలలో, అన్ని స్థాయిలలో మహిళా సిబ్బంది సమానస్థాయిలో పాల్గొనడం.
- మహిళలకు వారి అవసరాలను, హక్కులను గురించి చర్చించగలిగే అవకాశం వుండడం
- సిబ్బందిలో లైంగిక సమానత్వంతో కలిసి పనిచేయడం అనేది వృత్తిపరమైన ప్రతిభగా, సామర్ధ్యంగా గుర్తించడం
- లైంగిక సమానత్వ సమస్యలను పరిష్కరించే దిశగా సిబ్బంది అందరికీ ఒకేవిధమైన అవగాహనను కల్పించడం
- సిబ్బంది విధి విధానాలలో మహిళల నియామకాలలో ప్రాతినిధ్యం, సమాన పనికి సమాన వేతనం, సామర్థ్యాలు నైపుణ్యాల పెంపుదలకు మహిళలకు అవకాశాలు కల్పించడం, అనువైన పనివేళలు, ప్రసూతి , పితృత్వ సెలవులు, విశ్రాంతి గది, ప్రత్యేకమైన మరుగుదొడ్లు, మహిళల కోసం, మహిళలకు సంబంధించిన సమస్యల గురించి చర్చించుకునేందుకు వారికి తగిన స్థలం, పిల్లల సంరక్షణకు సంబంధించిన సౌకర్యాల గురించి నిర్దిష్టంగా వుండడం
- సామాజిక భద్రతా చర్యలు, కుటుంబ సభ్యులకు, భార్యాభర్తలకు లైంగికత్వంపై అవగాహన కల్పించడం.
- మహిళలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపులను నియంత్రించగలిగే విధివిధానాలు , ఏరకమైన హింసకు తావులేని సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం.
- కార్యాలయంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌కు సంబంధించిన విధివిధానాలు
- లైంగికత్వ దృక్పధానికి సంబంధించిన అంశాలను సమావేశాలలో లేవనెత్తి చర్చించడం; అదేవిధంగా సదస్సులలో, శిక్షణలలో విషయాంశంగా అవగాహన కల్పించడం.
- లైంగికత్వానికి సంబంధించి తటస్థమైన భాషను వాడడం; స్త్రీలకు సంబంధించి వారిని ప్రభావితం చేసే భాషను నిషేధించడం.
- మహిళలు క్షేత్ర స్థాయి సందర్శనలు చేసినపుడు లేదా సుదూర ప్రాంతాలకు వెళ్ళినపుడు వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి విధి విధానాలను తయారుచేయడం. గుర్తింపు కార్డులను ఇవ్వడం, రవాణా సౌకర్యాలు కల్పించడం, గర్భిణీ స్త్రీలకు, చంటిపిల్లల తల్లులకు ఎక్కువ గంటలు పని చేయవలసివచ్చినపుడు వారికోసం కావలసిన వసతులను ఏర్పాటుచేయడం
- లైంగికత్వంపై సిబ్బంది అందరికి అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడం

- మహిళా సంఘాలతో; మహిళల హక్కులు, మానవ హక్కులపై పనిచేసే సంస్థలతో అనుసంధానాలకు అవకాశం కల్పించడం
- లైంగిక సమానత్వ సాధనకు అవసరమైన వనరులను కేటాయించడం
- లైంగిక సమానత్వంపై పనిచేసే కమిటీ ఏర్పాటు

ఈ అంశాలతో కూడిన సంస్థ విధానాన్ని వ్రాతపూర్వకంగా పొందుపరచాలి. ఈ విధాన రూపకల్పనలో మొత్తం సిబ్బంది భాగస్వాములు కావాలి. ఈ లిఖిత రూప విధానాన్ని యాజమాన్యం ఆమోదించాలి.

## 6.3 జెండర్ ప్రధాన జీవన స్రవంతి: కార్యక్రమ స్థాయిలో

ఫెసిలిటేటర్ జెండర్ అంశాలను గురించి వివరించిన తరువాత ఒక సంస్థ చేసే కార్యక్రమం లైంగికత్వానికి అనుగుణంగా వుండాలంటే ఆ కార్యక్రమంలో ఏఏ అంశాలు వుండాలో సభ్యులు చిన్న గ్రూపులో చర్చించుకుని వచ్చి వివరించాలని చెప్పాలి.వారు వివరించే విషయాలను బోర్డుపై వ్రాసుకుని, ఈ కింద పేర్కొన్న అంశాల ద్వారా ఈ అంశంపై వారికి మరింత అవగాహన కలిగించాలి.





- మహిళలను లైంగికత్వ ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడానికి, లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఏ కార్యక్రమంలో అయినా మహిళలకోసం ప్రత్యేక అంశాలు వుండాలి.
- కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముందు లైంగికపరమైన సమస్యలు, స్త్రీ పురుషుల విధులు, బాధ్యతలు, సహకారాలు, ప్రాధాన్యతలు, ప్రత్యేక అవసరాల గురించి విశ్లేషించాలి.
- ఈ లైంగిక విశ్లేషణ ఫలితాంశాలకు అనుగుణంగా కార్యక్రమ ప్రణాళికలో సమస్య గుర్తింపు, సమాచార సేకరణ, సలహా సంప్రదింపులు, పర్యవేక్షణ, మూల్యాంకనము మొదలగు అంశాలను పొందుపరచాలి
- నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పురుషులతో సమానంగా మహిళల భాగస్వామ్యం కూడా పెంచాలి
- మహిళల కనీస అవసరాలను, వ్యూహాత్మక అవసరాలను తీర్చేవిధంగా ప్రణాళిక రూపొందించాలి
- సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య వున్న సామాజిక అంతరాలను ఈ కార్యక్రమం పెంచుతుందా తగ్గించుతుందా విశ్లేషణ చేయాలి.
- మహిళల శక్తి సామర్థ్యాలను, వారి స్థాయిని పెంచే విధంగా కార్యక్రమాలను రూపొందించాలి
- ఈ కార్యక్రమం మహిళల వనరుల సమీకరణ; కుటుంబం , సామాజిక వనరులపై నియంత్రణ చేయగలిగిందా అని విశ్లేషించాలి
- పురుషుల పాత్ర మహిళా సాధికారతను ప్రోత్సహించే విధంగా వుండేలా చూడాలి
- లైంగిక సమానత్వ సూచికలను రూపొందించాలి, నివేదికలో పొందుపరచాలి
- ఈ కార్యక్రమంలో మహిళల సాధికారతకు కేటాయింపులు ఏ మేరకు వున్నాయో విశ్లేషించాలి

## 6.4 జెండర్ తనిఖీ / ఆడిట్ :

ఈ విషయాంశం చివరలో సభ్యులు జెండర్ ఆడిట్ ఆవశ్యకత,వాటి లక్ష్యాలు ఎలా వుంటాయో అవగాహన పెంపొందించుకోగలుగుతారు. విధి విధానాలు, కార్యక్రమాలు, వాటి అమలు లైంగికత్వాన్ని ప్రధాన జీవన స్రవంతిలోకి తేవడంలో ఎంత ప్రభావవంతంగా, సమర్థంగా పని చేయగలవో సంస్థాగతంగా, కార్యక్రమం పరంగా, వ్యక్తిగత స్థాయిలో పరిశీలించి చూసుకోగలుగుతారు

- లైంగిక సమానత్వాన్ని అర్థం చేసుకుని సిబ్బంది అందరూ లైంగిక సమానత్వ దృక్పథంతో పనిచేసే విధానాన్ని రూపొందించడం.
- అభివృద్ధికి , లైంగిక సమానత్వానికి అనుగుణమైన ఉత్పత్తులను, సేవలను అందించడంలో జెండరు జీవన స్రవంతి ఏమేరకు ఉపయోగపడుతుందో అంచనా వేయాలి.
- సంస్థలో జెండరు జీవన స్రవంతికి తోడ్పడిన సానుకూల ప్రతిస్పందనలు, సమాచార విధివిధానాలను, పద్ధతులను, వైఖరులను గుర్తించాలి.
- లైంగికత్వ జీవన స్రవంతి కోసం, లైంగిక కార్యక్రమాల కోసం కేటాయించిన , ఖర్చు చేసిన వనరుల స్థాయిని విశ్లేషించాలి.
- లైంగికత్వాన్ని దృష్టిలో వుంచుకుని మానవ వనరులను ఏమేరకు కేటాయించారో పరిశీలించాలి.
- సంస్థ వివిధ స్థాయిలలో స్త్రీ, పురుషుల నిష్పత్తిని పరిశీలించాలి.
- లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పురోగతిని కొలుచుటకు ఏదైనా ఒకే అంశాన్ని గుర్తుగా పెట్టుకుని ఆ ప్రక్రియను పరిశీలించాలి
- లైంగికత్వ జీవన స్రవంతి కార్యక్రమాలను అమలు చేసే కార్యాచరణ ప్రణాళిక పురోభివృద్ధిని తరచి చూసుకుంటూ అవసరాన్ని బట్టి అనువైన మార్పులు చేర్పులు చేయాలి


- కార్యాచరణ ప్రణాళికను ఉత్తమంగా అమలు పరచడానికి తగిన సలహాలు , వ్యూహాలు చేయడానికి తగిన స్థలాన్ని గుర్తించాలి.
- లైంగిక సమానత్వ కోణంలో సంస్థకు వున్న బలాలను, బలహీనతలు గుర్తించి బలాలను, సామర్ధ్యాలను పెంచుకోవాలి
- లైంగిక సమానత్వానికి సంబంధించిన సమాచారం ఇచ్చిపుచ్చుకోవడంలోను, ప్రతిస్పందించడంలోను సంస్థకు నేర్చుకునే అవకాశం కలిగించాలి

సంస్థ స్థాయిలో ఈ జెండర్ ఆడిట్‌ను ప్రతి సంవత్సరం లేదా 2 సంవత్సరాలకు ఒకసారి చేయడం వలన జెండరు సమానత్వం సాధించే దిశలో పనిచేయగలిగే అవకాశం పొందుతూ ప్రాముఖ్యమైన జెండరు సమానత్వాన్ని సాధించుకోగలుగుతారు. అంతేకాకుండా ఇతర సంస్థలకు సమాజానికి మార్గదర్శకంగా నిలబడతారు అని వివరించాలి.

## 6.5 కార్యాచరణ ప్రణాళిక, అనంతర చర్యలు

ఫెసిలిటేటర్ సభ్యులందరి చేత మొత్తం విషయాంశాలను క్రోడీకరిస్తూ , నేర్చుకున్న అంశాలపై మరొకసారి పునరాలోచన చేయించాలి. అంతేకాకుండా రాబోయే రోజులలో సంస్థ పరంగా కానీ, వ్యక్తిపరంగా కానీ లైంగికత్వం గురించి నేర్చుకున్న అంశాలపై వారి కార్యాచరణ ప్రణాళికను తయారు చేయమని అడగాలి. రాబోయే ఇన్ని రోజులలో లైంగికత్వానికి సంబంధించిన ఇన్ని విషయాలపై ఇన్ని కార్యక్రమాలు చేయగలుగుతాము అని సభ్యులందరి చేత చార్టు తయారు చేయించి అందరికి చదివి వినిపించాలి.

ఇంతేకాకుండా బాధ్యత కలిగిన పౌరులుగా లైంగిక సమానత్వం సాధించడంలో తమ వంతు కృషిగా ఇంటా, బయట ప్రయత్నం చేస్తామని, ప్రతి రోజు తమకు ఎదురయ్యే లైంగికత్వ అంశాలకు సంబంధించి వ్యక్తిగతంగా



ఏవిధంగా చర్యలు, ప్రతి చర్యలు చేయవచ్చునో గమనించుకుంటూ లైంగిక సమానత్వ సాధనకు కృషిచేస్తామని సభ్యులందరిచేత విడివిడిగా ప్రమాణం చేయించాలి (పూవుపెట్టడం, లేదా జ్యోతి వెలిగించడం) .

ఈ కార్యక్రమం జరిగిన తీరు గురించి సభ్యుల అభిప్రాయాలను, సలహాలను అడిగి తెలుసుకుని ఈ శిక్షణా కార్యక్రమాన్ని ముగింపు చేయాలి.




AF DRIVING SCHOOL
AF DRIVING SCHOOL